Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 149 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శుక్రవారం, 19 - 12 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం: 2015

## వీబీ జీ రామ్‌జీ బిల్లుకు లోక్‌సభ ఆమోదం




**న్యూఢిల్లీ:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో 'వీబీ జీ రామ్ జీ' పేరుతో తీసుకువచ్చిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ప్రతిపక్ష ఎంపీల ఆందోళనలు, నిరసనల మధ్య ఈ బిల్లును ఆమోదించారు. అయితే, బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి నిరసన వ్యక్తం చేశారు. విపక్ష సభ్యుల నిరసనలపై స్పందించిన స్పీకర్.. బిల్లుపై సుదీర్ఘంగా చర్చించారని చెప్పారు. దీంతో మరింత ఆగ్రహానికి గురైన విపక్ష సభ్యులు.. బిల్లు ప్రతులను చించి పడేశారు. వీరి ఆందోళనల మధ్యే బిల్లు ఆమోదం పొందినట్లు స్పీకర్ ప్రకటించారు. ఇక లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో.. ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు.

**లోక్‌సభలో గందరగోళం..**

కాంగ్రెస్ పార్టీ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, డీఎంకే నాయకులు టీఆర్ బాలు, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు ధర్మేంద్ర యాదవ్ సహా పలువురు విపక్ష పార్టీల సభ్యులు..జీ రామ్‌జీ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. బిల్లుకు వ్యతిరేకంగా సభలో ఆందోళన చేపట్టారు. ఈ పథకానికి మహాత్మాగాంధీ పేరును తొలగించడం అంటే జాతి పితను అవమానించడమేనని, కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ఈ బిల్లుతో రాష్ట్రాలపై మరింత భారం పడుతుందని ఆరోపించారు. మరోవైపు జీ రామ్‌జీ బిల్లును కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమర్థించారు. బిల్లుపై లోక్‌సభలో మాట్లాడిన శివరాజ్ సింగ్.. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలకు నెహ్రూ పేరును పెట్టిందని గుర్తు చేశారు. ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోందని విమర్శించారు. ప్రభుత్వానికి పేర్లు మార్చాలనే దురుద్దేశం ఉందంటూ ప్రియాంక గాంధీ చేసిన వ్యాఖ్యలను సైతం ఆయన ఖండించారు. పేర్లు మార్చాలనే ఉద్దేశం కేవలం ప్రతిపక్ష పార్టీలకు మాత్రమే ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని తమ ప్రభుత్వం కేవలం పనిపై మాత్రమే దృష్టి పెడుతోందని చెప్పుకొచ్చారాయన. ఎంజీఎన్ఆర్ఇజీఏ అవినీతి సాధనం తప్ప మరొకటి కాదని, అందరితో చర్చించిన తర్వాతే కొత్త చట్టాన్ని తీసుకువచ్చామని కేంద్ర మంత్రి ఉద్ఘాటించారు. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కామెంట్స్‌పై ప్రతిపక్ష సభ్యులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు ఎంపీలు సభ వెల్‌లోకి ప్రవేశించి.. బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. బిల్లు ప్రతులను చించేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లా మాట్లాడుతూ.. 'కాగితాలను చించివేయడానికి ప్రజలు మిమ్మల్ని ఇక్కడికి పంపలేదు. దేశం మిమ్మల్ని చూస్తోంది.' అని విపక్ష సభ్యులను హెచ్చరించారు. అనంతరం సభను వాయిదా వేశారు. సభ వాయిదా పడిన తరువాత పార్లమెంట్ వెలుపల ప్రియాంక గాంధీ వాద్రా మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన జీ రామ్‌జీ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. 'బిల్లులోని వివరాలను చదివిన ఎవరికైనా గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎలా పూర్తి కాబోతోందో అర్థమవుతుంది. ఈ బిల్లు వలన రాష్ట్రాలపై మరింత ఆర్థిక భారం పడనుంది. రాష్ట్రాలు ఆర్థికంగా ఇబ్బంది పడే అవకాశం ఉంది. ఎంజీఎన్ఆర్ఇ జీఏ పథకం పేదలకు అండగా ఉండేది. కానీ, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన బిల్లు పేదలకు పూర్తి వ్యతిరేకంగా ఉంది.' అంటూ కేంద్ర ప్రభుత్వం తీరుపై తీవ్ర విమర్శలు చేశారు ప్రియాంక. కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ మాట్లాడుతూ.. లోక్‌సభలో విపక్ష సభ్యులు వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో బిల్లు కాగితాలను చించి వేశారని.. ఇది ఖండించాల్సిన అంశమన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలకు చోటు లేదన్నారు. జీ రామ్‌జీ బిల్లుపై సుదీర్ఘంగా చర్చించారని.. అయినప్పటికీ విపక్ష సభ్యులు బిల్లు ప్రతులను చించడం దారుణమన్నారు. ప్రజల ప్రయోజనాల కోసమే ఈ బిల్లును తీసుకురావడం జరిగిందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ మాట్లాడుతూ.. లోక్‌సభలో ప్రతిపక్ష సభ్యులు వ్యవహరించిన తీరు ఏమాత్రం ఆమోదనీయం కాదన్నారు. 'మీకు వ్యతిరేకించే హక్కు ఉంది. కానీ, ఈ రకమైన ప్రవర్తన సరికాదు. బిల్లు ప్రతులను చించివేయడం, విమానాలు తయారు చేయడం, స్పీకర్‌పై విసరడం సరికాదు. దేశంలోనే అతిపురాతన పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ సభ్యులు.. ఇలా ప్రవర్తించడం గర్హనీయం. బిల్లుకు పెట్టిన పేరును విపక్ష సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. కానీ, రాముడి పేరు ఆ మహాత్మాగాంధీకి ఎంతో ఇష్టమైన పేరు. ఆయన తుదిశ్వాస విడిచే సమయంలోనూ 'హే రామ్' అనే అన్నారు.' అంటూ కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

## ఎకనామిక్ టైమ్స్ అవార్డుపై సీఎం చంద్రబాబు రియాక్షన్



**అమరావతి, (రాజధాని వార్తలు):** ప్రతిష్టాత్మకమైన 'బిజినెస్ రీఫార్మర్ ఆఫ్ ది ఇయర్' అవార్డుకు ఏపీ సీఎం చంద్రబాబు నాయు డును ప్రముఖ దినపత్రిక ఎకనామిక్ టైమ్స్ ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ అవార్డుపై కలెక్టర్ల సదస్సులో సీఎం స్పందించారు. ఈ తరహా అవార్డులు ఎప్పుడూ తాను తీసుకోలేదని.. విదేశీ యూనివర్సిటీలు డాక్టరేట్ ఇస్తామన్నా సున్నితంగా తిరస్కరించినట్లు చెప్పా రు. ఈ అవార్డు రావటం వెనుక క్రెడిట్ అంతా తన సహచరులు, అధికారులు, కలెక్టర్లదే అని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విషయంలో గతంలో గుజరాత్ మొదటి స్థానంలో నిలిచిందని... ఆ తర్వాత ప్రతీ ఏడాది ఏపీనే అగ్రస్థానంలో నిలిచిందని సీఎం చెప్పుకొచ్చారు. ఎన్నిసార్లు నిబంధనలు మార్చినా ఏపీనే నెంబర్ వన్‌గా ఉందన్నారు. ఇప్పుడు గేర్ మార్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని సీఎం తెలిపారు. 18 నెలల్లో 25 పాలసీలను తీసుకు వచ్చి పరిశ్రమలను, పెట్టుబడులను తీసుకు వస్తున్నామన్నారు. ప్రతీ నెలా ఎస్ఐపీసీ, ఎస్ఐపీబీల ద్వారా పెట్టుబడులకు ఆమోదం తెలియచేస్తున్నామని చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పూర్తి సహకారం అందిస్తున్నారని.. ఇక కేంద్రం ఇస్తున్న సహకారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మరువకూడదని ముఖ్యమంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వంలో ధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించ గలుగుతారా అని చాలా మంది అనుమానాలు వ్యక్తం చేశారని.. రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని చెప్పాం.. చేసి చూపిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజలు, పరిశ్రమలు ఏపీని విశ్వసిస్తున్నాయన్నారు. దేశంలోని ఏ రాష్ట్రం తీసుకు రాని విధంగా పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం ఎస్క్రో ఖాతాను తీసుకు వచ్చామని.. దీనికి త్వరలోనే మార్గదర్శకాలు జారీ చేస్తామని వెల్లడించారు. లేబర్ కోడ్ గైడ్ లైన్స్ విషయంలోనూ కేంద్రం ఏపీని సంప్రదించిందన్నారు. అందుకే ఇప్పుడు గేర్ మార్చి స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్‌ను అమలు చేయాలని నిర్ణయించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## జోగి రమేష్ బ్రదర్స్‌కు దక్కని ఊరట

**అమరావతి, (రాజధాని వార్తలు):** నకిలీ మద్యం కేసులో జోగి బ్రదర్స్‌కు ఊరట లభించలేదు. అద్దేపల్లి బ్రదర్స్, జోగి బ్రదర్స్ బెయిల్ పిటిషన్లను ఎక్సైజ్ కోర్టు గురువారం డిస్మిస్ చేసింది. ఈ కేసులో ఏడుగురు నిందితులు.. బాదల్ దాస్ (A7), ప్రదీప్ దాస్ (A8), కళ్యాణ్ (A12), రవి (A4), శ్రీనివాస్ తిరుమలశెట్టి (A13), శ్రీనివాస్ రెడ్డి (A11), సతీష్ (A17) లకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. నకిలీ మద్యం కేసులో అరెస్టయిన మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన సోదరుడు జోగి శ్రీరాములు, అద్దేపల్లి జనార్దన్‌రావు (A1)తోపాటు ఆయన సోదరుడు అద్దేపల్లి జగన్మోహన్ రావు (A2)తోపాటు ఈ కేసులో ప్రమేయం ఉన్న నిందితులు నెల్లూరు జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. బెయిల్ కోసం వీరు ఎక్సైజ్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ఈ రోజు విచారణ జరిపిన కోర్టు ఈ కేసులో కీలక నిందితులుగా ఉన్న ఈ నలుగురికి తప్పించి.. మిగిలిన ఏడుగురికి బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా ఇరు వర్గాల న్యాయవాదుల వాదనలు విన్న కోర్టు ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. జగన్ ప్రభుత్వ హయాంలో ఈ నకిలీ మద్యం కేసులో అద్దేపల్లి బ్రదర్స్‌కు జోగి బ్రదర్స్ అండగా ఉండి ప్రోత్సహించినట్లు కోర్టుకు ఆధారాలను ప్రభుత్వం తరఫు న్యాయవాది ఇప్పటికే అందజేశారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ కోర్టు ఈ నలుగురి బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నలుగురికి ఈ రోజుతో



రిమాండ్ ముగియనుంది. దాంతో వర్చువల్‌గా న్యాయమూర్తి ముందు పోలీసులు వీరిని హాజరుపరిచారు. డిసెంబర్ 31వ తేదీ వరకు వారి రిమాండ్‌ను పొడిగిస్తూ.. ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి నిర్ణయం తీసుకున్నారు. అయితే తమను నెల్లూరు కోర్టు నుంచి విజయవాడ కోర్టుకు మార్చాలంటూ వీరు కోర్టులో మరో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మధ్యాహ్నం విచారిస్తామని ఎక్సైజ్ కోర్టు స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపి కోర్టు తన నిర్ణయాన్ని వెలువరించే అవకాశం ఉంది.

## సీఎంకు ఎకనామిక్ టైమ్స్ అవార్డుపై లోకేష్ ట్వీట్



**అమరావతి, (రాజధాని వార్తలు):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడకు ప్రతిష్టాత్మక 'బిజినెస్ రీఫార్మర్ ఆఫ్ ద ఇయర్'గా అవార్డు రావడం పట్ల మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబుకు ప్రముఖ దినపత్రిక ఎకనామిక్ టైమ్స్ సంస్థ ఈ అవార్డును ప్రకటించింది. అవార్డుపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మంత్రి లోకేష్ స్పందించారు. సీఎం చంద్రబాబుకు బిజినెస్ రీఫార్మర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు రావడం ఏపీకి గర్వకారణమన్నారు. తమ కుటుంబానికి ఈ అవార్డు ఎంతో ప్రతిష్టాత్మకం అని మంత్రి లోకేష్ తెలిపారు.

**లోకేష్ ట్వీట్**

'సీఎం చంద్రబాబుకు 'బిజినెస్ రీఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, మా కుటుంబానికి ఇది ఎంతో ప్రతిష్టాత్మకం. దేశంలో సంస్కరణల ప్రయాణాన్ని స్పష్టత, ధైర్యం, స్థిరత్వంతో ముందుకు తీసుకెళ్లిన అరుదైన నాయకుల్లో చంద్రబాబు ఒకరని జ్యూరీ ప్రశంసించింది. పాలనలో సంస్క రణలు, వేగం, విశ్వాసం అనే మూడు సూత్రాలపై ఆయన చూపిన అచంచల నిబద్ధతకే ఈ అవార్డు నిదర్శనం. రాష్ట్రాభివృద్ధికి, పెట్టుబ డుల ఆకర్షణకు, సంస్కరణాత్మక పాలనకు చంద్రబాబు నాయకత్వం దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తోంది. సంస్కరణలే మార్గం – పాలనలో విశ్వాసమే మా లక్ష్యం' అంటూ మంత్రి లోకేష్ ట్వీట్ చేశారు.

**మంత్రుల అభినందనలు...**

అలాగే సీఎం చంద్రబాబుకు ప్రతిష్టాత్మక అవార్డు రావడంపై మంత్రులు అభినందనలు తెలియజేశారు. సీఎంకు 'బిజినెస్ రీఫార్మర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు రావడంపై మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. ప్రముఖ దినపత్రిక ది ఎకనామిక్ టైమ్స్ అందించే అవార్డు ఈసారి సీఎం చంద్రబాబు నాయుడును వరించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. సీబీఎన్ బ్రాండ్‌తో ఏపీలో పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయన్నారు. విజన్ 2047కు అనుగుణంగా స్నేహపూర్వక వ్యాపార అనుకూల విధానాలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, భారీ ఇన్సెంటివ్‌లు తదితర పారిశ్రామిక సంస్కరణలతో అవార్డు దక్కిందని మంత్రి వెల్లడించారు. ఏపీపై ఇన్వెస్టర్లలో నమ్మకం పెరుగుతోందనడానికి వెల్లువలా వస్తున్న పెట్టుబడులే నిదర్శనమని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి సీబీఎన్ నాయకత్వం,అధునాతన సాంకే తికతను అనుసంధానం చేస్తూ ప్రవేశపెట్టిన పాలనా సంస్కరణలు కీలకంగా మారాయన్నారు. ప్రాజెక్టు మీది.. భరోసా మాది.. ఏపీలో పెట్టుబడి పెట్టి మీరు ప్రారంభించే ప్రాజెక్టులను ప్రభుత్వానివిగా భావిస్తామన్న మాట ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని నింపిందని చెప్పుకొచ్చారు. కేంద్రం సహకారం, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలో పర్యాటకాభివృద్ధి పరుగులు పెడుతోందని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.

**ఏపీకి సీబీఎన్ బ్రాండ్ అంబాసిడర్: మంత్రి సవిత**

సీఎం చంద్రబాబుకు బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ అవార్డుపై మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పనితీరుకు, నిబద్ధతకు ఎకనమిక్ టైమ్స్ సంస్థ అవార్డు నిదర్శనమన్నారు. సీఎం చంద్రబాబుకు అవార్డు రావడం ఏపీకే గర్వకారణమని తెలిపారు. చంద్రబాబు పాలనలో దేశంలోనే ఏపీ నెంబర్ వన్ కావడం ఖాయమని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమం అమలు చంద్రబాబుకే సాధ్యమని చెప్పుకొచ్చారు. ఏపీకి సీఎం చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అని తెలిపారు. చంద్రబాబు సమర్థత వల్లే 18 నెలల కాలంలో రూ.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని మంత్రి సవిత వెల్లడించారు.

## రామ్మోహన్‌కు బర్త్ డే విషెస్ తెలిపిన ప్రధాని, సీఎం

**అమరావతి, (రాజధాని వార్తలు):** కేంద్ర పౌర విమాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు జన్మదినం సందర్భంగా పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ ట్విట్టర్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. రామ్మోహన్ ఆయురారోగ్యాలతో మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. విమానయాన రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న తీరు చాలా బాగుందని వారు ప్రశంసించారు.

**రామ్మోహన్ విస్తృతంగా కృషి చేస్తున్నారు: ప్రధాని మోదీ**

కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకి ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. పౌర విమానయాన రంగాన్ని సంస్కరించడానికి విస్తృతంగా కృషి చేస్తున్నారని వ్యాఖ్యానించారు. రామ్మోహన్ దీర్ఘాయుష్షుతో నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థిస్తున్నానని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

**రామ్మోహన్‌కు సీఎం చంద్రబాబు బర్త్ డే విషెస్..**

కేంద్ర పౌర విమాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన




శుభాకాంక్షలు తెలిపారు. రామ్మోహన్‌కు మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు ఉండాలని కోరుకుంటున్నానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**రామ్మోహన్ మరిన్ని విజయాలు సాధించాలి: మంత్రి నారా లోకేశ్**

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'మీ నిబద్ధత, పనితనం, మీ దృఢ సంకల్పాన్ని దగ్గరగా చూశాను. మీరు భారతదేశ పౌర విమానయాన రంగాన్ని రూపొందిస్తున్న తీరు మాకు గర్వంగా ఉంది. మీకు మంచి ఆరోగ్యం, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నాను' అని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

# ఉర్దూ అకాడమీ స్వర్ణోత్సవ లోగో జాకెట్ ఆవిష్కరణ

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఉర్దూ అకాడమీ గోల్డెన్ జూబ్లీ సందర్భంగా సురూర్ ఎ ఉర్దూ మహోత్సవ్ పేరిట జరుగుతున్న కార్యక్రమంలోస్వర్ణోత్సవ లోగో జాకెట్ ను రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. బుధవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫారూక్ షుబ్లీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'ఉర్దూ వారోత్సవాల'లో భాగంగా ఇబ్బందికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ అధికారులు పాల్గొన్నారు.



# గిరిజన గురుకులంలో జరిగిన అవినీతి అక్రమాలపై న్యాయ విచారణ జరిపి, బాధిత సెక్యూరిటీ గార్డు కుటుంబాలకు న్యాయం చేయాలి

## - వడిత్యా శంకర్ నాయక్ ప్రభుత్వానికి డిమాండ్

**(రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో గత రెండు సంవత్సరాల కాలంలో గిరిజన గురుకులంలో జరిగిన కోట్లాది రూపాయల అవినీతి అక్రమాలపై న్యాయ విచారణ జరిపి, బాధిత సెక్యూరిటీ గార్డు కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ, మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు, గిరిజన ప్రజా సమాఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు వడిత్యా శంకర్ నాయక్ కీలక విషయాలను మీడియా ద్వారా ప్రజల దృష్టికి తీసుకు వచ్చారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థలో గత రెండు సంవత్సరాలకు పైగా యస్.ఆర్.ఆర్. ప్రాజెక్ట్స్ సంస్థ ద్వారా పనిచేస్తున్న సుమారు 600 మంది సెక్యూరిటీ సిబ్బందికి సంబంధించిన ఇ.పి.యఫ్. మరియు ఇ.యస్.ఐ.లను సక్రమంగా నెలవారీగా చెల్లించకుండా, దాదాపు రూ.14 కోట్ల రూపాయల మేరకు నిధుల దుర్వినియోగం (స్కామ్) జరిగినట్టు తమ దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. శాఖ నుంచి ఒక్కో సెక్యూరిటీకి నెలకు లిరూ.12,800/-లు చెల్లిం పులు జరిగేలా బిల్లులు విడుదలవుతున్నప్పటికీ, వాస్తవంగా సెక్యూరిటీ సిబ్బందికి మాత్రం నెలకు కేవలం రూ.6,500/-లే జీతంగా చెల్లిస్తున్నారని పలువురు సిబ్బంది ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. అలాగే నెలకు రూ.3,650/-లు చెల్లించాల్సిన ఇ.పి.యఫ్.కు బదులు రూ.600/-లు మాత్రమే, రూ.550/-లు చెల్లించాల్సిన ఇ.యస్.ఐ.కు బదులు రూ.200/-లు మాత్రమే చెల్లిస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే అనంతపురం జిల్లాకు చెందిన కొంత మంది నాయకులు జిల్లా అదనపు లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, ఆయన సైతం పూర్తి వివరాలను లిఖితపూర్వకంగా గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి కార్యాలయానికి పంపినప్పటికీ, ఇప్పటివరకు సంబంధిత ఏజెన్సీపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అత్యంత దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత పెద్ద మొత్తంలో జరిగిన ఈ స్కామ్‌కు బాధ్యులైన యస్.ఆర్.ఆర్. ప్రాజెక్ట్స్ సంస్థతో పాటు, శాఖలో బిల్లులు పరిశీలించకుండా సుమారు రూ.24 కోట్ల బిల్లులు చెల్లించడంలో సహకరించిన అధికారులపై కూడా శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, వారిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కావున ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి వెంటనే జోక్యం చేసుకొని, 600 మంది సెక్యూరిటీ సిబ్బందికి సంబంధించిన ఇ.పి.యఫ్., ఇ.యస్.ఐ., జీతభత్యాల బకాయిలను పూర్తిగా రికవరీ చేసి, సంబంధిత మొత్తాలను సెక్యూరిటీ సిబ్బంది వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలని, యస్.ఆర్.ఆర్. ప్రాజెక్ట్స్ సంస్థ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ఇప్పటివరకు జరిగిన అన్యాయానికి సెక్యూరిటీ సిబ్బందికి పూర్తి న్యాయం చేయాలని, గిరిజన ప్రజా సమాఖ్య తరఫున బలంగా డిమాండ్ చేస్తున్నట్లు వడిత్యా శంకర్ నాయక్ తెలిపారు. ఈ మీడియా సమావేశంలో గిరిజన నేతలు పాత్రావత్ దుర్గా నాయక్ - జి.పి.ఎస్. గుంటూరు జిల్లా అధ్యక్షులు, ఇస్లావత్ హనుమంతు నాయక్ - రాష్ట్ర యువజన అధ్యక్షులు, భూక్య సమీర్ నాయక్ - కృష్ణా జిల్లా అధ్యక్షులు, ఇస్లావత్ భాస్కర్ నాయక్, జరపలా కృష్ణా నాయక్, జరపల నాణిక్య నాయక్, ఎరుకుల పేరయ్యే, యానాది సత్యం తదితరులు పాల్గొన్నారు.






# విజయవంతంగా ఎఎస్‌టి సూపర్ సింగర్ తొలి ఆడిషన్

## - హాజరైన తెలంగాణ అగర్వాల్ సమాజ్ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** ఎఎస్‌టి సూపర్ సింగర్ తొలి ఆడిషన్ విజయవంతంగా ముగిసింది. అగ్రవాల్ సమాజ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎఎస్‌టి సూపర్ సింగర్ తొలి ఆడిషన్ విజయవంతంగా ముగిసింది. అగ్రవాల్ సమాజ సభ్యుల మధ్య నిర్వహించిన ఈ గీతాల పోటీలో 18 సంవత్సరాల పైబడిన పురుషులు, మహిళలు పాల్గొన్నారు. ఈ పోటీని రెండు విభాగాలుగా నిర్వహించారు. తొలి ఆడిషన్‌లో ఎంపికైన మొత్తం 35 మంది పోటీదారులు డిసెంబర్ 22న జరగనున్న రెండో ఆడిషన్‌లో తమ గానం ప్రదర్శిస్తారు. ఈ రెండో ఆడిషన్‌లో ఎంపికైన వారు 2026 జనవరి 4న భారతీయ విద్యాభవన్‌లో జరిగే గ్రాండ్ ఫినాలేలో పాల్గొననున్నారు. ఈ తొలి ఎడిషన్ ప్రారంభం సందర్భంగా మహారాజ అగ్రసేన్ జీకి ప్రత్యేక పూజా అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమాజ ఉపాధ్యక్షుడు రూపేష్ అగ్రవాల్, మంత్రి వికాస్ కేసన్, నిర్వహణ కమిటీ కన్వీనర్ దిలీప్ పంసారీ, సహ కన్వీనర్ మహేంద్ర అగ్రవాల్, అశోక్ జిందాల్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి సమాజ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా కూడా హాజరై, సమాజ బంధువుల కోసం నిర్వహించిన ఈ గీతాల పోటీని ప్రశంసిస్తూ పోటీదారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి పంకజ్ సంఘీ, శీతల్ రుంగ్టా తదితరులు సహకారం అందించారు. 45 సంవత్సరాల లోపు వయస్సు విభాగంలో ఎంపికైన 10 మంది పోటీదారులు: దీపక్ అగ్రవాల్ - గోషమహల్ శాఖ, కనక్ పిత్తి - అమీర్‌పేట్ శాఖ, పవన్ దోకానియా - షాలీబండా శాఖ, ప్రశాంత్ దేవ్ గుప్తా - అత్తాపూర్ సెంట్రల్ శాఖ, రోహన్ అగ్రవాల్ - మలక్‌పేట్ యువ మోర్చా శాఖ, సౌరభ్ అగ్రవాల్ - అమీర్‌పేట్ శాఖ, సందీప్ కుమార్ అగ్రవాల్ - జ్ఞానబాగ్ కాలనీ శాఖ, వికాస్ అగ్రవాల్ పిత్తి - సికింద్రాబాద్ నార్త్ శాఖ, యశ్ అగ్రవాల్ - మలక్‌పేట్ శాఖ. 45 సంవత్సరాల పైబడిన వయస్సు విభాగంలో ఎంపికైన పోటీదారులు: అమిత్ కుమార్ అగ్రవాల్ - శివరాంపల్లి శాఖ, అనిల్ కేడియా - బహదూర్‌పురా శాఖ, అనూప్ కుమార్ అగ్రవాల్ - గచ్చిబౌలి శాఖ, అశోక్ కుమార్ బంసల్ - రికాబ్‌గంజ్ శాఖ, భావనా గోయల్ - అత్తాపూర్ వెస్ట్ శాఖ, బిమల్ కుమార్ కేడియా - అత్తాపూర్ వెస్ట్ శాఖ, దీపక్ అగ్రవాల్ - అగ్రసేన్ మార్గ్ శాఖ, దీపక్ అగ్రవాల్ - అత్తాపూర్ వెస్ట్ శాఖ, దినేష్ కుమార్ అగ్రవాల్ - శివరాంపల్లి శాఖ, డా. మోహన్ గుప్తా - హిమాయత్‌నగర్ శాఖ, గాయత్రి గుప్తా - మలక్‌పేట్ మహిళా శాఖ, జయప్రకాశ్ అగ్రవాల్ - శ్యామ్ మందిర్ శాఖ, జ్యోతి అగ్రవాల్ - మురళీనగర్ శాఖ, కమలేష్ అగ్రవాల్ - గచ్చిబౌలి మహిళా విభాగం శాఖ, మహేష్ కుమార్ కేడియా - గోషమహల్ శాఖ, మాణిక్లాల్ అగ్రవాల్ - శ్యామ్ మందిర్ శాఖ, నిధిష్ సింగాల్ - సోమాజీగూడ-బేగంపేట శాఖ, పంకజ్ అగ్రవాల్ - మలక్‌పేట్ శాఖ, సావర్‌మల్ అగ్రవాల్ - సికింద్రాబాద్ పారడైజ్ శాఖ, శిఖా అగ్రవాల్ - గచ్చిబౌలి శాఖ, శివభగవాన్ అగ్రవాల్ - ఘాంసీ బజార్ జూలా శాఖ, స్నేహలత అగ్రవాల్ - అత్తాపూర్ మహిళా సేవికా శాఖ, ఉమేష్ కుమార్ అగ్రవాల్ - లకడి కా పుల్ శాఖ, విశాల్ అగ్రవాల్ - బంజారా సెంట్రల్ శాఖ, విశ్వనాథ్ అగ్రవాల్ - మురళీనగర్ శాఖ.

# మంత్రి రాంప్రసాద్ రెడ్డితో సమావేశమైన కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

**- మంత్రితో పలు అంశాలపై ఎమ్మెల్యే చర్చ - 5.70 ఎకరాల భూమిలో రూ.400 లక్షల అంచనా వ్యయంతో సమగ్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి వినతి**

**- కోవూరు నియోజకవర్గంలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి వినతి**



**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు నియోజకవర్గంలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి లక్ష్యంగా ఉన్న అంశాలపై కోవూరు శాసన సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అమరావతి సచివాలయంలో రాష్ట్ర రవాణా, యువజ, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా ఇందుకూరుపేటలోని ఎం.కె.ఆర్ హైస్కూల్ ఆవరణలో ఉన్న 5.70 ఎకరాల భూమిలో రూ.400 లక్షల అంచనా వ్యయంతో సమగ్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ క్రీడా సముదాయం ద్వారా గ్రామీణ ప్రాంత యువతకు ఆధునిక క్రీడా సదుపాయాలు అందుబాటులోకి వచ్చి, క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. అదేవిధంగా గతంలో మంజూరైనప్పటికీ ఇప్పటివరకు పూర్తి కాకుండా నిలిచిపోయిన విడవలూరులోని ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం, కొడవలూరులోని ఏపీటిడబ్ల్యుఆర్ఐఈఎస్ పాఠశాలలో స్టేడియం, ఆట మైదానాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. పనుల ఆలస్యం వల్ల విద్యార్థులు, యువ క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకు వచ్చారు.



**భారత ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్‌ని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఢిల్లీలోని ఉపరాష్ట్రపతి కార్యాలయానికి వెళ్లిన ఎంపీ వేమిరెడ్డి. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ఆయనతో వివిధ అంశాలపై మాట్లాడారు.**

# రైల్వేలో లగేజ్ పై ఉన్న పరిమితులు ఏంటి?

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రైల్వేలలో ప్రయాణికులు తమ వెంట తెచ్చే లగేజ్‌లపై పరిమితులు ఉన్నాయా అని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నించారు. రైల్వే స్టేషన్లలో స్కానింగ్ కోసం తీసుకునే చర్యలపై ఆరా తీశారు. అనుమతించదగిన లగేజీని పెంచడానికి/తగ్గించడానికి ఏదైనా ప్రతిపాదన ఉందా అని వివరాలు కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నలకు కేంద్ర రైల్వేలు, సమాచార & ప్రసారం మరియు ఎలక్ట్రానిక్స్ & సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం, ప్రయాణీకుడు తనతో పాటు కంపార్ట్‌మెంట్ల లోపల సామాను తీసుకెళ్లడానికి తరగతి వారీగా గరిష్ట పరిమితిని నిర్దేశించారని అన్నారు. ప్రయాణీకులు ఉచిత భత్యం కంటే ఎక్కువ సామానును బుక్ చేసుకుని, గరిష్ట పరిమితి వరకు కంపార్ట్‌మెంట్‌లో తీసుకెళ్లడానికి అనుమతి ఉందన్నారు. లగేజీ రేటుకు 1.5 రెట్లు ఛార్జీలు చెల్లిస్తే సరిపోతుందని, 100 సెం.మీ.×60 సెం.మీ.×25 సెం.మీ. (పొడవు×వెడల్పు×ఎత్తు) బయటి కొలతలు కలిగిన ట్రంక్‌లు, సూట్‌కేసులు మరియు పెట్టెలను ప్రయాణీకుల కంపార్ట్‌మెంట్‌లలో వ్యక్తిగత సామానుగా తీసుకెళ్లడానికి అనుమతి ఉందన్నారు. ట్రంక్‌లు, సూట్‌కేసులు, పెట్టెలు ఏదైనా కొలతలకు మించి ఉంటే, వాటిని ప్రయాణీకుల కంపార్ట్‌మెంట్‌లలో కాకుండా బ్రేక్‌వాన్ /పార్సెల్ వ్యాన్‌లలో బుక్ చేసుకుని తీసుకెళ్లాల్సి ఉందన్నారు. వ్యాపార వస్తువులను బుకింగ్ చేయడానికి మరియు కంపార్ట్‌మెంట్‌లో తీసుకెళ్లడానికి అనుమతి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు రైల్వేలలో నేరాల నివారణ, గుర్తింపు, నమోదు మరియు దర్యాప్తు మరియు శాంతిభద్రతలను నిర్వహించడం వంటి బాధ్యతలను కలిగి ఉంటాయనీ, అవి ప్రభుత్వ రైల్వే పోలీస్ /జిల్లా పోలీస్ వంటి చట్ట అమలు సంస్థల ద్వారా నిర్వహిస్తాయన్నారు. అయితే, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రయాణీకుల ప్రాంతం మరియు ప్రయాణీకులకు మెరుగైన రక్షణ మరియు భద్రతను అందించడానికి మరియు దానికి సంబంధించిన విషయాలకు జిఆర్‌పి /జిల్లా పోలీసుల ప్రయత్నాలకు మద్దతు ఇస్తుందనీ తెలిపారు. హ్యాండ్ హెల్డ్ మెటల్ డిటెక్టర్ సహాయంతో ఆర్‌పిఎఫ్ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తారనీ, లోహ, నిషేధిత వస్తువులను గుర్తించడానికి వీలుగా స్టేషన్ల ఎంట్రీ & ఎగ్జిట్ గేట్ల వద్ద డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్‌లను ఏర్పాటు చేస్తారన్నారు.



# తమిళనాడు బోట్లు రాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలి : కలెక్టర్ హిమాన్షు శుక్ల

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** అమరావతిలోని సచివాలయంలో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో మొదటి రోజు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తమిళనాడు నుంచి చేపల వేట పడవలు ఆంధ్రప్రదేశ్ సముద్ర జలాల్లోకి అక్రమంగా ప్రవేశించడం, గృహ నిర్మాణ పథకం - ఆప్షన్-3కు సంబంధించి విజిలెన్స్ విచారణ ఆదేశాలు - ఏదైనా పరిష్కారం కనుగొని పనులు ప్రారంభించేం దుకు అనుమతించాలని, జువ్వలదిన్నె హార్బర్‌ను కార్యాచరణలోకి తీసుకు రావడం. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు నెల్లూరు జిల్లాకు వరి కొనుగోలు లక్ష్యం నిర్ణయం..తదితర అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..తమిళనాడులోని పాండిచ్చేరి, కారేకల్ నుండి అక్రమంగా మా నెల్లూరు సముద్ర తీర ప్రాంతంలోకి ముందుగా రెండు బోట్స్ రావడంతో వాటిని జువ్వలదిన్నె తీర ప్రాంతం వద్ద పట్టుకుని సీజ్ చేసి కేసులు నమోదు చేయడం జరిగింది. కొంతకాలం తర్వాత మరో రెండు బోట్లు రావడంతో వాటిని కూడా పట్టుకుని కేసులు నమోదు చేసాం. కానీ ఇలా తరచుగా రావడం మా మత్స్యకారులకు ఇబ్బంది, నష్టం జరుగుతుందని



స్లాబ్ పూర్తి చేసుకున్నాయన్నారు. మిగిలినవి వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయన్నారు. ఈ ఇళ్ల నిర్మాణాలను ఆప్షన్ -3 ఏజెన్సీస్ ద్వారా పూర్తిచేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఖరీఫ్ సీజన్లో 1.50 లక్షల వరి ధాన్యం సేకరణ చేయాలని అంచనాలు/టార్గెట్ ఇచ్చింది. అయితే మిగిలిన జిల్లాలోతో మా నెల్లూరు జిల్లాను పోల్చుకుంటే ఇక్కడ ఎర్లీ రబీ, లేట్ ఖరీఫ్ (అక్టోబర్

# ది ఎకనామిక్ టైమ్స్ ద్వారా ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడుకు 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును ప్రదానం చేశారు

## - సునీల్ భారతి మిట్టల్, సజ్జన్ జిందాల్, నోయెల్ టాటా నేతృత్వంలోని విశిష్ట జ్యూరీ నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ పరివర్తనను గుర్తించింది

**అమరావతి, ముంబై, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడుకు భారతదేశంలోని ప్రముఖ వ్యాపార ప్రచురణ అయిన ది ఎకనామిక్ టైమ్స్ ప్రతిష్ఠాత్మకమైన "బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్" అవార్డును ప్రదానం చేసింది, ఆయన దూరదృష్టి గల ఆర్థిక సంస్కరణలు, పెట్టుబడిదారులకు అనుకూలమైన పాలన మరియు పరివర్తన నాయకత్వాన్ని గుర్తించి. భారతీయ ఎంటర్‌ప్రైజెస్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ సునీల్ భారతి మిట్టల్‌బీ జెఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సజ్జన్ జిందాల్‌బీ, టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటాతో సహా భారతదేశంలోని అత్యంత ప్రముఖ వ్యాపార నాయకులలో కొంతమందితో కూడిన అత్యంత విశిష్ట జ్యూరీ ఈ అవార్డును నిర్ణయించింది. పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పునర్నిర్మించడం, సంస్థాగత సంస్కరణలు మరియు వృద్ధి-ఆధారిత పాలన కోసం కొత్త నమూనాను సృష్టించడంలో నాయుడు యొక్క ఆదర్శవంతమైన రికార్డును జ్యూరీ ఉదహరించింది. నాయుడు గురించి విస్తృతమైన ప్రొఫైల్‌లో, 2024 ఎన్నికల తర్వాత సంస్కరణల నేతృత్వంలోని పాలనకు నాయుడు నిర్ణయాత్మకంగా తిరిగి రావడాన్ని ఈ ప్రచురణ హైలైట్ చేసింది మరియు ఆంధ్రప్రదేశ్ కేవలం 18 నెలల్లో 10.7 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను ఆకర్షించిందని పేర్కొంది. ఇవి కేవలం ఆసక్తి వ్యక్తీకరణలు మాత్రమే కాదని, మంత్రివర్గం ఆమోదించిన ప్రాజెక్టులు, వివిధ రంగాలలో అమలులో వివిధ దశల్లో ఉన్నాయని ప్రచురణ నొక్కి చెప్పింది. నాయుడును భారతదేశంలోని అగ్రశ్రేణి ఆర్థిక సంస్కర్తలలో ఒకరిగా మరియు సమాచార సాంకేతిక పరిజ్ఞానం యొక్క ప్రారంభ విజేతగా, హైదరాబాద్‌ను ప్రపంచ సాంకేతిక కేంద్రంగా




స్థాపించడంలో విస్తృతంగా ఘనత పొందిన వ్యక్తిగా ఈ ప్రచురణ అభివర్ణించింది. పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత, ఆంధ్రప్రదేశ్ నుండి నిష్క్రమించిన వ్యాపారాలను తిరిగి గెలుచుకోవడం, లులు గ్రూప్, అశోక్ లేలాండ్, రీన్యూ మరియు సింగపూర్ నుండి వచ్చిన వాటాదారులతో సహా ప్రముఖ ప్రపంచ మరియు భారతీయ పెట్టుబడిదారులతో వ్యక్తిగతంగా ఎలా సంభాషించడం మరియు రాష్ట్రంలో తిరిగి పెట్టుబడి పెట్టడానికి వారిని ఒప్పించడం ఎలా ప్రాధాన్యతనిచ్చారో ఈ వ్యాసం గుర్తుచేసింది. ది ఎకనామిక్ టైమ్స్ పత్రిక చంద్రబాబు నాయుడుని ఉటంకిస్తూ ఆయన ఇలా నివేదించింది: "ఈ గుర్తింపు వ్యక్తిగత అవార్డు కాదు, కానీ ఒక పెద్ద ప్రయాణానికి గుర్తింపు - నిర్మించిన సంస్థలు, అనుసరించిన సంస్కరణలు మరియు జీవితాలను మార్చే సంస్థ శక్తిపై ఉంచిన విశ్వాసం. ఆర్థిక వృద్ధి మరియు సామాజిక పురోగతి కలిసి సాగాలని ఆంధ్రప్రదేశ్ ఎల్లప్పుడూ విశ్వసిస్తుంది." వ్యాపారాలు నమ్మకంగా కొత్త ఆవిష్కరణలు చేయగల, పెట్టుబడులు ఉద్యోగాలుగా మారగల, మరియు వృద్ధి స్థిరంగా, కలుపుకొని, సాంకేతికతతో నడిచే ఒక పర్యావరణ వ్యవస్థను సృష్టించడంలో రాష్ట్ర సంస్కరణల ఎజెండా లంగరు వేయబడిం దని ప్రచురణ పేర్కొంది. నాయుడు పాలనా నమూనా ఆయనను ఒక ప్రత్యేకమైన లీగ్‌లో ఉంచుతుందని జ్యూరీ గమనించింది, ఆయనను కొత్త శైలి రాజకీయ నాయకత్వానికి ఉదాహరణగా అభివర్ణించింది - తరచుగా దీనిని 'అసలు సిఇఓ ముఖ్యమంత్రి' అని పిలుస్తారు. ఆర్థిక స్థితి, శాంతిభద్రతలపై శ్వేతపత్రాల వాడకం, తక్షణ జోక్యం అవసరమయ్యే ప్రాంతాలను గుర్తించడానికి వారసత్వ విధాన సవాళ్లతో సహా ఆధారాల ఆధారిత విధాన రూపకల్పనపై నాయుడు ప్రాధాన్యతను ప్రచురణ మరింత హైలైట్ చేసింది. ఇది పెట్టుబడిదారులకు స్పష్టత మరియు విశ్వాసాన్ని అందించే "వ్యాపారం చేసే వేగాన్ని" గణనీయంగా పెంచిన రంగాల-నిర్దిష్ట విధానాలను రూపొందించడానికి దారి తీసిందని జ్యూరీ పేర్కొంది, ఇది ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ యొక్క నిర్వచించే పోటీ ప్రయోజనంగా పరిగణించబడుతుంది. ప్రోత్సాహకాల సకాలంలో చెల్లింపును నిర్ధారించడానికి ఎస్క్రో యంత్రాంగాలను ప్రవేశపెట్టడం, రెడ్ టేప్‌ను తగ్గించడానికి నిర్ణయాత్మక చర్యలు మరియు ఆంధ్రప్రదేశ్‌ను ప్రాధాన్యత పెట్టుబడి గమ్యస్థానంగా ఉంచడానికి చురుకైన పాలన వంటి అనేక మైలురాయి చొరవలను ఉదహరించారు. ఈ సంస్కరణల ఆధారంగా, రాష్ట్రం మార్క్యూ పెట్టుబడులను ఆకర్షించింది, వాటిలో విశాఖపట్నంలో డేటా సెంటర్ క్లస్టర్‌ను అభివృద్ధి చేయడానికి గూగుల్ ఐదు సంవత్సరాలలో $15 బిలియన్ల అతిపెద్ద ప్రపంచ ఎఫ్‌డిఐ నిబద్ధత, బ్రూక్‌ఫీల్డ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ మరియు డిజిటల్ రియాలిటీతో భాగస్వామ్యంతో డిజిటల్ కనెక్షన్ ద్వారా $11 బిలియన్ల పెట్టుబడి, మరియు అనకాపల్లి జిల్లాలో దేశంలోనే అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి ఏఎం/ఎన్ఎస్ ఇండియా ప్రణాళికలు ఉన్నాయి. పెట్టుబడుల పెరుగుదల రాష్ట్ర ఆర్థిక స్థితిని బలోపేతం చేసిందని, ప్రభుత్వం కీలకమైన సంక్షేమ కార్యక్రమాలను నిలబెట్టుకోవడానికి మరియు క్రాస్-సబ్సిడీ చేయడానికి వీలు కల్పిస్తుందని ప్రచురణ గమనించింది. వీటిలో నిరుపేద మహిళలు తమ పిల్లల విద్యకు మద్దతు ఇవ్వడానికి లక్ష్యంగా పెట్టుకున్న ఆర్థిక సహాయం, రైతులకు సహాయం మరియు అర్హతగల కుటుంబాలకు ఎల్‌పిజి సిలిండర్ల సరఫరా వంటి అవసరమైన గృహ సహాయం ఉన్నాయి. బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు సంస్కరణ, పారదర్శకత మరియు సమానత్వంతో వృద్ధికి రాష్ట్రం పునరుద్ధరించిన నిబద్ధతకు ధృవీకరణ అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేర్కొంది. ఎన్.చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఆంధ్రప్రదేశ్ భారతదేశంలో అత్యంత పోటీతత్వ, పెట్టుబడికి అనుకూలమైన మరియు భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న రాష్ట్రాలలో ఒకటిగా మారడానికి సాహసోపేతమైన మార్గాన్ని రూపొందిస్తోంది.

# యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేపై సచివాలయ సిబ్బందికి శిక్షణ

**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలం 21 సచివాలయాల 23 గ్రామాల సిబ్బందికి యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే (యుఎఫ్ఎస్)పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ పరిధిలో చంద్రన్న సమావేశ మందిరంలో మండల జీఎస్‌డబ్ల్యూఎస్ ఆఫీసర్ కర్రీ శ్రీనివాసరావు అధ్యక్షతన, ఎంపీడీవో జటావల్లభుల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంఓటీ వై.నాగేంద్రబాబు (కొరిపల్లె వెల్ఫేర్ అసిస్టెంట్) శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంలో ఎంపీడీవో జటావల్లభుల శ్రీనివాస్ మాట్లాడుతూ యుఎఫ్ఎస్ ద్వారా ప్రతి కుటుంబానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరిస్తామని ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు సక్రమంగా చేరేందుకు సచివాలయ సిబ్బంది బాధ్యత కీలకమని తెలిపారు. సర్వే నిర్వహణ విధానం, మొబైల్ ట్యాబ్‌లో డేటా ఎంట్రీ, గ్రామ స్థాయిలో కుటుంబాల



గుర్తింపు, డోర్‌టుడోర్ సర్వే పద్ధతి వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు సహా ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో భారత విశ్వవిద్యాలయాల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థుల పరిశోధన & ఆవిష్కరణ పోటీ (సౌత్ జోన్) అన్వేషణ్ 2025








**అమరావతి, (రాజధాని వార్తలు):** భారత విశ్వవిద్యాలయాల సంఘం నిర్వహించిన విద్యార్థుల పరిశోధన & ఆవిష్కరణ పోటీ (సౌత్ జోన్) అన్వేషణ్ 2025, డిసెంబర్ 18, 2025న వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం విజయవంతంగా ముగిసింది. ఇది డిసెంబర్ 17-18, 2025న వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో జరిగింది, ఇది భారతదేశంలోనే అతిపెద్ద పరిశోధన మరియు ఆవిష్కరణ పోటీ. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అహంతెం శాంతా సింగ్ హాజరయ్యారు. అయన మాట్లాడుతూ దేశ నిర్మాణంలో యువత నేతృత్వంలోని పరిశోధన యొక్క కీలక పాత్రను తెలియచేసారు మరియు కృత్రిమ మేధా ప్రపంచంలో నైతిక, ఆధారాల ఆధారిత మరియు ప్రభావవంతమైన శాస్త్రీయ విచారణ యొక్క అవసరాన్ని వివరించారు. గౌరవ అతిథిగా జీనియస్ ఫిల్టర్స్ అండ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పంచుమర్తి లక్ష్మీ భీమేష్ హాజరయ్యారు. అయన మాట్లాడుతూ విద్యార్థులు తమ పరిశోధనా కార్యకలాపాలను వాస్తవ ప్రపంచ పారిశ్రామిక మరియు సామాజిక సవాళ్లతో అనుసంధానించాలని, ఆవిష్కరణ, స్థిరత్వం మరియు వ్యవస్థాపకత యొక్క ప్రాముఖ్యతను తెలియచెప్పారు. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అమరేంద్ర పాణి ప్రత్యేక అతిథిగా హాజరై, పాల్గొన్న వారందరినీ మరియు అవార్డు గ్రహీతలను అభినందించారు. బలమైన, పరిశోధన-కేంద్రీకృత విద్యా వ్యవస్థను పెంపొందించాలనే విశ్వవిద్యాలయం యొక్క దార్శనికతను పునరుద్ఘాటించారు. అన్వేషణ్ వంటి వేదికలు సైద్ధాంతిక జ్ఞానం మరియు వాస్తవ ప్రపంచ అనువర్తనాల మధ్య అంతరాన్ని తగ్గించడంలో కీలకమైనవని, విద్యార్థులలో విమర్శనాత్మక ఆలోచన, సహకారం మరియు ఆవిష్కరణలను కూడా పెంపొందిస్తాయని ఆయన తెలియచేయారు. ఈ కార్యక్రమానికి వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డా.పి. అరుల్మోళివర్మన్ మరియు రిజిస్ట్రార్ డా.జగదీష్ చంద్ర ముదిగంటి కూడా హాజ రయ్యారు. ఈ కార్యక్రమంలో 34 విశ్వవిద్యాలయాల నుండి మొత్తం 964 మంది విద్యార్థులు పరిశోధన పోటీకి నమోదు చేసుకున్నారు, వీరిలో భారతదేశంలోని నాలుగు దక్షిణ రాష్ట్రాల (ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక మరియు తెలంగాణ) నుండి 24 విశ్వవిద్యాలయాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 273 మంది యువ పరిశోధకులు తమ పరిశోధన మరియు ఆవిష్కరణలను ప్రదర్శించడానికి పోటీకి ఎంపికయ్యారు. విద్యార్థి పరిశోధకులు సమర్పించిన ప్రాజెక్టులను విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థలు మరియు పరిశ్రమల నుండి 18 మంది ప్రముఖ నిపుణుల బృందం కఠినమైన మరియు బహుళ-స్థాయి మూల్యాంకన ప్రమాణాల ద్వారా నిర్ణయించింది, అత్యుత్తమ విద్యార్థి పరిశోధన ప్రాజెక్టులను పోస్టర్ ప్రజెంటేషన్ మరియు పోడియం ప్రజెంటేషన్ రెండింటి నుండి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమం ప్రతి ట్రాక్ నుండి మొదటి, రెండవ మరియు మూడవ స్థానాల్లో నిలిచిన విజేతలను సత్కరించారు. ఇది దక్షిణ జోన్ అంతటా ప్రాంతీయ విద్యా సహకారాన్ని బలోపేతం చేయడంలో మరియు పరిశోధనా నైపుణ్యం, ఆవిష్కరణ మరియు విద్యార్థుల సాధికారత సంస్కృతిని ప్రోత్సహించడంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. 36 మంది సభ్యులతో కూడిన నిర్వాహక బృందానికి వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయ అధ్యాపకులు డా.సంతను మండల్ (సమన్వయకర్త) మరియు డా.సోమ్య రంజన్ సాహూ (సహ సమన్వయకర్త) నాయకత్వం వహించారు.

# 29వ వార్డు భుజంగరావుపేట ఏరియాలో పర్యటించిన వార్డు జనసేన అధ్యక్షులు అంగటి శ్రావణ్ కుమార్

## - స్థానికులతో మాట్లాడి ప్రజా సమస్యలు తెలుసుకొని ఒక్క రోజులోనే అన్ని సమస్యలు పరిష్కారం

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ దక్షిణ నియో జకవర్గం ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ ఆదేశాల మేరకు 29వ వార్డు భుజంగరావు పేట ఏరియాలో పర్యటించిన 29వ వార్డు జనసేన అధ్యక్షులు అంగటి శ్రావణ్ కుమార్ స్థానిక మహిళలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కుళాయిలు సరిగ్గా రావడం లేదని తెలియజేయగా ఏఈ వాటర్ సప్లై విల్సన్‌ని ఫోన్ ద్వారా మాట్లాడి విషయం తెలుసుకోగా వాటర్ పైప్ లైన్లు రిపేర్లు ఉన్నాయని రేపటిలోగా పూర్తి స్థాయిలో పనులు పూర్తి చేసి సరిపడా నీరు ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావడం జరుగుతుందని హామీ ఇచ్చారు. డ్రైనేజ్ సిల్ట్‌లు కూడా రోడ్ల మీద పడి ఉన్నాయని యూజీడీ డిపార్ట్మెంట్ వారు రోడ్ల మీదే డ్రైనేజ్ వ్యర్థాలను వదిలేస్తున్నారని జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు దృష్టికి తీసుకువెళ్లగా అధికారుల్ని ఆదేశించి త్వరితన వ్యర్థాలను తొలగిస్తామని హామీ ఇచ్చారు. విరిగిన ఎలక్ట్రికల్ పోల్ తొలగించారని ఆ ప్రదేశం చీకటి మయంగా ఉన్నదని వర్క్ ఇన్స్పెక్టర్ సూర్యకి తెలియజేయగా రేపటిలోగా లైట్ వేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. కాలువలు కూడా సరిగా తీయడం లేదని నీరు పొంగి రోడ్ల మీదకు వస్తుందని ఇంచార్జి శానిటేషన్ ఇన్స్పెక్టర్ రాజుకి తెలియజేయగా తక్షణమే సమస్య పరిష్కారం చేశారు. అలాగే బోర్ పని చేయడం లేదని రిపేర్లు చేయాలని ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని వర్క్ ఇన్స్పెక్టర్ జీవన్‌కి తెలియజేయగా వాటర్ లెవెల్ తక్కువ ఉన్న కారణంగా మరమత్తులు చేసిన కూడా తగినంత నీరు రావడం కష్టం అని తెలియజేయగా అన్ని సమస్యలు ఒక్క రోజులోనే పరిష్కారం చేయడం జరిగింది. వార్డు పర్యటనలో ప్రతి సమస్యను అధికారులతో మాట్లాడి పనులు చేయిస్తున్న విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ పని తీరును స్థానిక మహిళలు అభినందించారు.

# విద్యార్థుల్లో పర్యావరణం పట్ల అవగాహన పెరగాలి : కోటంరెడ్డి సంధ్య





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** పర్యావరణం పట్ల అవగాహన పెంచేందుకు స్థానిక ఎంఎస్ఎం హై స్కూల్‌లో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన పర్యావరణ అవగాహన పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కోటంరెడ్డి సంధ్య పుస్తకాలు పంపిణీ చేసి విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈరోజు ఒక మంచి కార్యక్రమాన్ని మన ఎంఎస్ఎం స్కూల్లో చేపట్టామని విద్యార్థుల్లో పర్యావరణ పట్ల అవగాహన పెరిగే విధంగా పుస్తకాలు వ్రాసిన ఎన్ఆర్ఐ స్టూడెంట్ శ్రీరామ్ భీమరాజుకి అభినందనలు తెలియజేశారు. విద్యార్థులు పర్యావరణ పట్ల అవగాహన పెంచుకొని ముఖ్యంగా ప్లాస్టిక్ వాడ కాన్ని నిరోధించాలని, ప్లాస్టిక్ బాటిల్లో నీళ్లు తాగకుండా గ్లాసు సీసాలు మెటల్ బాటిల్స్‌తో నీళ్లు తెచ్చుకొని తాగాలని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగం కారణంగా పర్యావరణం దెబ్బతినడమే కాకుండా క్యాన్సర్ వ్యాధి ప్రబలడానికి ప్రధాన కారణంగా ప్లాస్టిక్ తయారైందని, విద్యార్థులందరూ ఈ పుస్తకాన్ని క్షుణ్ణంగా చదివి దాంట్లో ఉన్నటువంటి డ్రాయింగ్స్ వేసి మీతోటి విద్యార్థులకు కూడా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ మాట్లాడుతూ అమెరికాలో 12 స్టాండర్డ్ అనగా ఇక్కడ ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదివే శ్రీరామ్ భీమ్ రాజ్ మంచి ఆశయంతో పుస్తకాలను తయారు చేశారని, ఆ పుస్తకాలను క్షేత్రస్థాయిలో పాఠశాలల్లో విద్యార్థులకు పంచి అవగాహన కల్పించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడడమే తన ధ్యేయంగా ఈ పుస్తకాన్ని రాశారని, ఇంత మంచి పుస్తకాలు రాసినటువంటి శ్రీరామ్ భీమరాజుకి హృదయపూర్వక అభినందనలు తెలియచేస్తున్నాను అన్నారు. ఈ పుస్తకాలను కడపలోని మాకు మిత్రుడైన జర్నలిస్ట్ రఘునాథ్ మాకు పంపించి ఒక మంచి పాఠశాలలో పంపిణీ చేయమంటే ఈరోజు మన ఎమ్మెస్ స్కూల్లో ఈ పుస్తకాలను పంపిణీ చేశామని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ గారు మాట్లాడుతూ ఈ పుస్తకం ఎంతో సమాచారం కూడుకున్నదని విద్యార్థులందరూ దీని క్షుణ్ణంగా చదివి పర్యావరణం పట్ల అవగాహన పెంచుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బందితో పాటు స్థానిక నాయకులు ఆకుల హనుమంతరావు, అంచూరు శ్రీనివా సులు నాయుడు, పసుపులేటి మల్లికార్జునరావు, సుభాన్ భాష, ఆమంచర్ల ప్రభాకర్, నవులూరు శ్రీకృష్ణ, రెడ్డి, శ్రీనివాసరావు, మోహన్ నాయుడు, శ్రీహరి, ఫణి, గౌసియా, అలీ, రిటైర్డ్ ఎంప్లాయిస్ నాయకులు చంద్రశేఖర్, విశ్వం, రషీద్, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## జాతి నిర్మాణ స్ఫూర్తినివ్వని సంవాదాలు

'వందేమాతరం ఒక గీతం కాదు. జాతి నిర్మాణంలో తమ విధ్యుక్త ధర్మాన్ని నిర్వహించేలా ప్రజలను పురిగొలిపే చైతన్య శక్తి అది. ఆత్మనిర్భర్ భారత్ కలను సాధించేందుకు ఆ గీతం ఎనలేని ప్రేరణ కలిగిస్తుంది..' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. 'వందే మాతరం భారతదేశ ఆత్మ. ప్రతి భారతీయుడు దాన్ని సగర్వంగా గానం చేస్తాడు..' అని కాంగ్రెస్ నేత ప్రియాంకాగాంధీ అన్నారు. వందేమాతరం రచించి 150 సంవత్సరాలు అయిన సందర్భంగా పార్లమెంటు ఉభయ సభల్లో ఆసక్తికరమైన చర్చ జరిగింది. ప్రతి రోజూ ఉభయ సభలు గందరగోళం మధ్య వాయిదా పడుతున్న తరుణంలో స్వాతంత్ర్యోద్యమంలో భారతీయులను ఉత్తేజపరిచి, అమర త్యాగాలకు స్ఫూర్తి కలిగించిన బంకించంద్రుని అజరామర గీతంపై పార్లమెంటులో చర్చ జరగడం ఒక సంతోషకరమైన పరిణామం. ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పేరిట ఓట్ చోరీ జరుగుతోందని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు ఈ శీతాకాల సమావేశాలను తొలి రెండు రోజులు అడ్డుకున్నాయి. ఆ తర్వాత వందేమాతరంపై ప్రతిపక్షాలు చర్చకు అంగీకరించినందుకు ప్రతిఫలంగా ప్రభుత్వం ఎన్నికల సంస్కరణలపై రెండు రోజుల పాటు చర్చకు ఆమోదించింది. ఆ విధంగా 'సర్'పై విపక్షాలు అభ్యంతరాలు లేవనెత్తేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. వందేమాతరం, ఎన్నికల సంస్కరణలపై ఇరు పక్షాలకు చెందిన నాయకులు వాడిగా, వేడిగా చర్చలు జరపడం పార్లమెంటు పట్ల ప్రజల ఆసక్తిని పెంచిందనే భావించాలి. పార్లమెంటు అనేదే చర్చలకు వేదిక. ప్రభుత్వం తలుచుకుంటే పార్లమెంటులో చర్చలు జరిగేందుకు ఆస్కారం ఉన్నదని ఈ సమావేశాలు నిరూపించాయి. వందేమాతరంపై చర్చ జరగడం వల్ల తమకు ప్రయోజనం ఉంటుందని బీజేపీ అగ్రనేతలు భావించడమే ఇందుకు కారణం. ఈ చర్చల ప్రమాణాలు మాత్రం అంత గొప్పగా ఏమీ లేవు. వందేమాతరం ప్రాధాన్యాన్ని ఈ దేశంలో అన్ని రాజకీయ పార్టీలు గుర్తించినందువల్ల దాని ఘనతను కీర్తిస్తూ ప్రజలకు కలిసికట్టుగా ఒక స్ఫూర్తిని కలిగించేందుకు ఆరోగ్యకరమైన చర్చ జరగాలని ప్రభుత్వం భావించినట్లు కనపడలేదు. ఉభయ సభలు వందేమాతరం స్ఫూర్తితో దేశం ఏ విధంగా పయనించాలన్న విషయమై ఒక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించి ఉంటే ఆ గీతాన్ని తగిన విధంగా గౌరవించినట్లుండేది. ఇరుపక్షాల నేతలు వందేమాతరం గీత ప్రాశస్త్యాన్ని వివరిస్తూనే ఒకరిపై మరొకరు తీవ్ర విమర్శలు చేసుకున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ ముస్లింలను బుజ్జగించేందుకు ఈ గీతాన్ని కుదించివేశారని బీజేపీ విమర్శిస్తే, బెంగాల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని హిందూ, ముస్లిం విద్వేషాలను రెచ్చగొట్టేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ విమర్శించింది. బహిరంగసభల్లో ఒకరిపై మరొకరు దుమ్మెత్తిపోసుకున్నట్లుగా వందేమాతరం వంటి ప్రభావశీల గీతంపై రాజకీయ చర్చ జరగడం విషాదకరం. ఆ జాతీయ గీతంపై ఆర్ఎస్ఎస్ నేత రాంమాధవ్ రాసిన ఒక వ్యాసంలో పాకిస్థాన్‌ను లౌకిక దేశంగా రూపొందించడంలో జిన్నా విఫలమయ్యారని, అయితే హిందూ, ముస్లింలు పరస్పరం సౌభ్రాతృత్వంతో సహజీవనం చేసే దేశాన్ని నిర్మించడంలో గాంధీ విజయవంతం అయ్యారా లేదా మనం ప్రశ్నించుకోవాలని ఆయన అన్నారు. అత్యంత బలహీనులకు కూడా అత్యంత బలవంతులైన వారికి ఉండే శక్తి లభించాలని గాంధీజీ ఆశించినట్లు ఆయన పేర్కొన్నారు. మరి అ లాంటి పరిస్థితులు మన దేశంలో ఉన్నాయా? ప్రధానమంత్రి అన్నట్లు వందేమాతరం గీతం స్ఫూర్తితో ప్రతి భారతీయుడూ కృషి చేసి ఆత్మనిర్భర్ భారత్ దిశగా దేశం పయనించేలా చేస్తే మంచి పరిణామమే. అయితే వందేమాతరం ప్రభావం ఇవాళ దేశంలో అన్ని రంగాల్లో చూపే అవకాశం ఉన్నదా అన్నది చర్చనీయాంశం. గత కొన్ని నెలలుగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారతదేశాన్ని అనేక రకాలుగా అవమానిస్తున్నారు. సరిహద్దుల్లో అలజడి సృష్టిస్తున్న చైనా అవకాశం లభించినప్పుడల్లా అరుణాచల్‌ప్రదేశ్‌ను వివాదాస్పద ప్రదేశంగా చిత్రిస్తోంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత కూడా పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదాన్ని నిలిపివేయలేదు. భారతదేశానికి విశ్వగురు స్థానం లభించేందుకు మోదీ తీవ్ర కృషి చేసినప్పటికీ ఇవాళ విదేశాంగ విధానం అనేక అగ్నిపరీక్షల నెదుర్కొంటూ చరిత్ర మలుపులో దిక్కుతోచని స్థితిలో ఉన్నది. దక్షిణాఫ్రికాలో జరిగిన జీ-20 సమావేశాలకు అమెరికా, చైనా, రష్యా, సౌదీ అరేబియా హాజరు కాలేదు. ప్రపంచ రాజకీయాలు బహుళ ధ్రువంగా మారాలంటే గ్లోబల్ సౌత్‌కు నాయకత్వం వహించే దిశగా భారత్ పావులు కదపాల్సి ఉన్నది. విషాదకరమైన విషయం ఏమంటే స్టార్టప్‌లను ఎంతగా ప్రోత్సహించినప్పటికీ, వాటిలో చాలా భాగం నిధుల లోటుతో మూతపడుతున్నాయి. ప్రభుత్వ మద్దతు లేకపోతే తమ కాళ్లపై తాము నిలబడగల సంస్థలు తక్కువే. ఐఐటీ, ఐఐఎంలలో చదువుకున్న వారిలో అత్యధికులు మెరుగైన అవకాశాల కోసం విదేశాలవైపు చూస్తున్నారు. అక్కడైతే తమ శ్రమకు తగ్గ ఫలితం దొరుకుతుందని భావిస్తున్నారు. మన మేధస్సు వలస వెళ్లకుండా ఇక్కడే తలెత్తుకుని జీవించగలిగిన పరిస్థితి ఏర్పడ్డప్పుడే వందేమాతరం గీతానికి సార్థకత లభిస్తుంది. ఇక ఆర్థిక రంగంలో ఆత్మనిర్భర్ మాటకు వస్తే అనేక ప్రశ్నలు తలెత్తక తప్పదు. 'వందేమాతరం స్వదేశీ ఆత్మ ఆలపించే సంగీతం' అని టాగోర్ అన్నారు. 'స్వదేశీ అంటే తలుపులు మూయడం కాదు, వెన్నెముకను పటిష్ఠం చేయడం' అని నెహ్రూ రాజ్యాంగ సభలో చెప్పారు. భారత్ ఒక అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే రైతులు, శ్రామికులు, హస్తకళాకారులు, వ్యాపారులు అందరినీ వందేమాతరం స్ఫూర్తితో చైతన్యపరిచే దిశగా నేతలు కృషి చేయవలసిన అవసరం ఉన్నది. అయితే దేశం విదేశీ సరుకులకు ఒక మార్కెట్‌గా మారిపోతోంది.

## టీడీపీ విశాఖ జిల్లా నూతన అధ్యక్షులు పట్టాభికి శుభాకాంక్షలు తెలిపిన సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ జిల్లా తెలుగుదేశం పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన చోడే పట్టాభిరామ్ శివాజీపాలెం క్యాంపు కార్యాలయంలో జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షులు, దక్షిణనియోజకవర్గం శాసనసభ సభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టాభిని శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది. అదేవిధంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ పట్టాభికి స్వీట్ తినిపించి, శాలువా వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

## విశాఖలో ఘనంగా పవన్ కళ్యాణ్ కళా పీఠం మెగా మ్యూజికల్ నైట్

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** పవన్ కళ్యాణ్ కళా పీఠం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక పౌర గ్రంథాలయం వద్ద మెగా మ్యూజికల్ నైట్ అంగరంగ వైభవంగా జరిగింది. పవన్ కళ్యాణ్ మరియు చిరంజీవి అభిమానులు, విశాఖలోని ప్రముఖ కళాకారులు విస్తృతంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ కార్పొరేటర్ కందుల నాగరాజు, జనసేన పార్టీ కార్పొరేటర్ బి.వసంతలక్ష్మి మరియు కళాకారుల సంక్షేమ సేవా చైర్మన్ వి.గంగులయ్య హాజరై కార్యక్రమాన్ని విజయవంతము చేసారు. వీరంతా పవన్ కళ్యాణ్ కళాపీఠం వ్యవస్థాపకుడు జగదీశ్‌ని అభినందించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ కళా పీఠం కళారంగానికే కాకుండా సామాజిక సేవలోనూ ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కళా పీఠం కార్యక్రమాలను జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు.

**సేవాభావానికి సత్కారం అవర్ హ్యాండ్స్ ప్రతినిధి పిల్లి గోవింద్ రాజు కి ఘన సన్మానం**

ఈ కార్యక్రమంలో విశాఖలో ఎక్కడ అనాథ మృతదేహం ఉన్నా జ్ఞానాపురం స్మశాన వాటిక వద్ద అనాథ మృతదేహాలకు మరణానంతర అంతిమ సంస్కార సేవలు చేస్తున్న గోవింద్‌ని ముఖ్య అతిథులు ప్రత్యేకంగా సన్మానించారు. కందుల నాగరాజు,



గంగులయ్య, వసంతలక్ష్మి గోవింద్ సేవా తపనను ప్రశంసిస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ప్రేరణగా నిలుస్తాయి అన్నారు. సామాజిక సేవ పట్ల ఆయన నిబద్ధతను అందరూ హర్షించారు. సంగీత విందుతో ముగిసిన వేడుక కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ సినీ గీతాలను స్థానిక కళాకారులు ఆలపించి ప్రేక్షకులను అలరించారు. ఈ సాయంత్రం కళా, సంగీత, సేవా పరిపూర్ణ సమ్మేళనం అయ్యింది. కార్యక్రమాన్ని కళా పీఠం అధ్యక్షుడు మెరువ వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి పీల హరిప్రసాద్, ప్రోగ్రామ్ కన్వీనర్లు శ్రీనివాస్ పట్నాయక్, రామచంద్ర యాదవ్, మరియు కళాకారులు సురేష్, శ్రీకాంత్, రవితేజ వంటి నటులు పాల్గొని సమర్ధంగా నిర్వహించారు.

## 48వ వార్డులో వేకువజాము నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన గంకల కవిత అప్పారావు యాదవ్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** గ్రేటర్ విశాఖ 48వ వార్డు పరిధిలో గల కొండ వాలు ప్రాంతం శ్రీనివాస్ నగర్, న్యూ శ్రీనివాస్ నగర్ ప్రాంతాలలో 48వ వార్డ్ కార్పొరేటర్, భారతీయ జనతా పార్టీ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ గంకల కవిత అప్పారావు బుధవారం నాడు వార్డులో గ్రామస్తులతో కలిసి ఉదయం 5 గంటల నుంచే గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో పర్యటన చేసారు. ఈ సందర్భంగా వార్డులో గల ఎలక్ట్రికల్, పారిశుధ్య, 24ఐ7 మంచి నీటి పనులు, నూతన కాలువలు నిర్మాణంపై, సీజనల్ వ్యాధులపై పర్యటన చేసి ప్రజల సమస్యలు తెలుసుకుని వార్డు ప్రజల నుంచి పలు ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా గంకల మాట్లాడుతూ వార్డులో గల శ్రీనివాస్ నగర్, న్యూ శ్రీనివాస్ నగర్ ప్రాంతంలో గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో భాగంగా బుధవారం నాడు పర్యటన చేయడం జరిగిందని, వేకువ జాము కావడంతో ప్రజలందరూ ఇండ్లలోనే ఉంటారని తెలిసి వేకుజామున 5 గంటల నుంచి గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమం నిర్వహించడం జరిగిందని వార్డులో పలు ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని, వార్డులో గల శ్రీనివాస్ నగర్, న్యూ శ్రీనివాస్ నగర్ సమస్యలు తీర్చాలని, గ్రామస్తులు కోరారు. అదే విధంగా గ్రామంలో పలు చోట్ల విద్యుత్ తీగలు కిందకి వేలబడి ఉన్నాయని వాటికీ మరమ్మతులు పనులు చేయమని కోరారు. కొన్ని ప్రదేశాలలో ఎలక్ట్రికల్ పోల్స్ మార్పులు చేయాలనీ, పారిశుధ్య సమస్యపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, మెట్లు, కాలువలు మారమ్మత్తులు చేపట్టాలని కోరారు. ప్రజల సమస్యలను త్వరలోనే పరిష్కారం చూపుతానని అన్నారు. డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమం ద్వారా ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలు తెలుసుకొని సంబంధిత అధికారులకు తెలపడం జరిగిందని మరియు కొన్ని నేరుగా సమీక్షించి సమస్య నెరవేర్చడం జరిగిందని అన్నారు. వార్డ్ ప్రజలకు ఎటువంటి సమస్య ఏర్పడిన తక్షణమే తనను సంప్రదించాలని అన్నారు. వార్డ్ ప్రజలు పిర్యాదు పట్ల, అభివృద్ధి కార్యక్రమాల పట్ల మహిళ కార్పొరేటర్‌గా ముందుకు వచ్చి అభివృద్ధి పనులకు చర్యలు చేపట్టి నిరంతరం శ్రమిస్తున్న వార్డ్ కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు యాదవ్ కృషి పట్ల గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ నగర్, న్యూ శ్రీనివాస్ నగర్ ప్రజలు పాల్గొన్నారు.

## విశాఖలో ఘనంగా వై ఎస్ షర్మిల జన్మదిన వేడుకలు

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నేడు 17 వ తేదీ డిసెంబర్ వైఎస్ షర్మిల పుట్టినరోజున ఘనంగా వేడుకలు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా నాయకులు ఈ రోజు పార్టీ కార్యాలయంలో జిల్లా ఇంచార్జి హాసిని వర్మ రాజు ఆధ్వర్యంలో వైఎస్ షర్మిల పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వై ఎస్ షర్మిల నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీని రాష్ట్ర అధ్యక్షురాలిగా ముందుండి నడిపిస్తున్న తీరును కొనియాడారు. రానున్న రోజుల్లో షర్మిలమ్మ నాయకత్వంలో పార్టీ పూర్వ వైభవంలోకి వస్తుందని పలువురు జిల్లా ఇంచార్జి వర్మ రాజుతో సహా పలువురు సీనియర్ నాయకులు ఆశాభావం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్ సెల్ చైర్మన్ కమలాకర్, జిల్లా నియోజక వర్గ ఇంచార్జిలు కేవి సూర్య నారాయణ, ప్రియాంక దండి, ఎస్సీ



సెల్ వెంకటరావు, వజ్జిపర్తి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు వంకర ఆనంద్ కుమార్, అరుగుల రాజేష్, గౌతం, వై ఎస్ జగన్, జాయింట్ సెక్రటరీ బ్రహ్మం, శ్రీధర్, విజయ్, అప్పారావు, సేవాదళ్ అప్పారావు, వెంకట రమణ కనకారావు గంగాధర్, ఇతర కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## "బాల్ వివాహ్ ముక్త్ భారత్"పై విస్తృత ప్రచారం



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** "బాల్య వివాహ్ ముక్త్ భారత్" 100 రోజుల కాంపెయిన్‌లో భాగంగా కాకినాడ జిల్లా, మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, మండల న్యాయ సేవాధికార సంస్థ చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సంయుక్తంగా, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక పెద్దాపురం మండలం మహాత్మా జ్యోతిభ పూలె ఆంధ్రప్రదేశ్ బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రిన్సిపల్ చల్లా లోవరాజు అధ్యక్షతన బాల్య వివాహ ముక్త భారత్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల్య వివాహ ముక్త భారత్ అనే కాంపెయిన్ 27 నవంబర్ 2025 నుండి 8 మార్చి 2026 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దేశంలో బాల్య వివాహరహిత దేశంగా భారత దేశాన్ని తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాలను విద్యారంగ సంస్థలలో నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. బాల్య వివాహ నిరోధ చట్టం 2006 ప్రకారం అమ్మాయికి 18 సంవత్సరాలు పూర్తి కాకుండా మరియు అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండకుండా వివాహం చేయరాదని అన్నారు. బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారం మరియు నేరం అని తెలియజేసారు. బాల్య వివాహాలు నుండి బాలలను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ పౌరుడుపై ఉందని అన్నారు. బాల్య వివాహాలు బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటం కమే కాకుండా వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలను దూరం చేస్తుందన్నారు. బాల్య వివా హం జరగడానికి చేసిన ఏ ప్రయత్నాన్నైనా పంచాయతీ, ప్రభుత్వ అధికారులకు తెలియపరచాలని లేదా చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ లీగల్ అడ్వకేట్ మడికి రాంబాబు మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వులు ప్రకారం మరియు 7వ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ వారు ఆదేశాలు మేరకు 100 రోజులు కాంపెయిన్‌లో బాల్య వివాహరహిత దేశంగా తీర్చిదిద్దాలనే దృక్పథంతో ఈ అవగాహన కార్యక్రమాలును సంబంధిత శాఖలు మరియు స్వచ్ఛంద సంస్థల సమన్వయముతో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఎవరైనా బాల్య వివాహాలను ప్రోత్సహించిన మరియు సహకరించిన లేదా వివాహం చేసిన బాల్య వివాహ నిషేధ చట్టం2006 ప్రకారం రెండు సంవత్సరాలు జైలుశిక్ష మరియు ఒక లక్ష రూపాయలు జరిమానా విధించడం జరిగిందని అన్నారు. పోక్సో చట్టం ప్రకారం కూడా చర్యలు తీసుకుంటామని తెలియజేసారు. ఈ కార్యక్రమములో పారాలీగల్ వాలంటీర్ నూతలపాటి అప్పలకొండ, యన్ శ్రీ హర్ష, ప్రధానోపాధ్యాయులు ఎం మాధవ, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## పెనుగుదరు సిమ్స్ ఫిజియోథెరపీ కాలేజ్‌లో స్నాతకోత్సవం





**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలం పెనుగుదరులో సిమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీలో ఫిజియోథెరపీ స్నాతకోత్సవ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల సెక్రటరీ డాక్టర్ బి.శివ శిరీష్, డైరెక్టర్ భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి. సూర్య ప్రకాష్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా కాకినాడ అపోలో హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ గణేష్ అడికి (బీడీఎస్, ఎండీ హెచ్ఎం) హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. కోర్సు పూర్తి చేసిన విద్యా ర్థులకు ఫిజియోథెరపీ వైద్య పట్టాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్ మాట్లాడుతూ వైద్య విద్య పవిత్రమైనదని ప్రస్తుత పరిస్థితుల్లో ఫిజియోథెరపీకి పెరుగుతున్న ప్రాముఖ్యతను వివరించారు. దేశవిదేశాల్లో ఉన్నత విద్యతో పాటు ఉద్యోగ అవకాశాలు విస్తారంగా ఉన్నాయని ఫిజియోథెరపీ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని అన్నారు. కళాశాల సెక్రటరీ డాక్టర్ శివ శిరీష్ మాట్లాడుతూ పుస్తక పఠనంతో పాటు పేషెంట్లకు ప్రత్యక్షంగా చికిత్స చేస్తూ నేర్చుకోవడం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కళాశాలలో ఉచిత ఫిజియోథెరపీ సేవలు, అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిమ్స్ కాలేజ్ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్టార్ హీరోపై మనసు పడ్డ యంగ్ బ్యూటీ



సినిమా ఇండస్ట్రీలో ఉండే అభిమానులకు సెలబ్రిటీలు అంటే ఎంత ఇష్టమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే ఆ సెలబ్రిటీలకు కూడా అభిమాన హీరో, హీరోయిన్లు ఉంటారు. అయితే ఆయా సందర్భాలు వచ్చినప్పుడు మాత్రమే తమకు ఇష్టమైన హీరో, హీరోయిన్ల గురించి బయటపడుతూ ఉంటారు. తమ అభిమాన హీరో, హీరోయిన్లే కాకుండా తమకు నచ్చిన ఆహారాల గురించి కూడా చెబుతూ అందరినీ ఆశ్చర్యపరుస్తూ ఉంటారు. ఈ క్రమంలోనే ఒక యంగ్ బ్యూటీ.. ఆ స్టార్ హీరో అంటే తనకు ఇష్టం అని చెప్పడమే కాకుండా.. తనకు ఇష్టమైన ఆహారం గురించి కూడా చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆమె ఎవరో కాదు మలయాళ బ్యూటీ అనశ్వర రాజన్. డిసెంబర్ 25న విడుదల కానున్న ఛాంపియన్ అనే సినిమాలో రోషన్ మేక సరసన నటిస్తోంది. ఈ సినిమా ద్వారానే తెలుగు తెరకు పరిచయం కాబోతోంది. అలాగే వెంకీ కుడుముల నిర్మించిన మరో తెలుగు చిత్రం ఇట్లు అర్జున అనే సినిమాలో కూడా కొత్త అనీష్ సరసన ఈమె నటించడానికి సైన్ చేసింది. ఈ రెండు తెలుగు భారీ ప్రాజెక్టులు ఈమె చేతిలో ఉండడంతో హైదరాబాదులోనే ఎక్కువ సమయాన్ని గడుపుతోంది. ఈ క్రమంలోనే తెలుగు సినిమా పట్ల అలాగే హైదరాబాదు సంస్కృతి పట్ల తన అభిమానాన్ని పంచుకుంది. హైదరాబాద్ బిర్యానీ అంటే తనకు చాలా ఇష్టం అని చెప్పిన ఈమె.. హైదరాబాదు రుచులను పూర్తిగా ఆస్వాదిస్తున్నాను అంటూ తెలిపింది. సెలబ్రిటీల గురించి మాట్లాడుతూ.. "రామ్ చరణ్ మగధీర సినిమాను లెక్కలేనన్నిసార్లు చూశాను. ముఖ్యంగా తెలుగు నటులలో నాకు అల్లు అర్జున్ అంటే చాలా ఇష్టం".. అంటూ తెలిపింది అనస్వర రాజన్. ప్రస్తుతం ఈమె చేసిన ఈ కామెంట్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. ఇక అల్లు అర్జున్ అంటే ఇష్టం అని చెప్పడంతో అల్లు అభిమానులు.. మగధీర సినిమాను లెక్కలేనన్ని సార్లు చూసాను అని చెప్పడంతో ఇటు మెగా అభిమానులు కూడా ఈమె గురించి తెలుసుకోవడానికి తెగ ఆసక్తి కనబరుస్తున్నారు. మరి ఈమె బ్యాక్ గ్రౌండ్ ఏంటో ఇప్పుడు చూద్దాం..2017 లో వచ్చిన ఉదాహరణం సుజాత అనే చిత్రంలో బాలనటిగా నటించిన ఈమె కేరళ రాష్ట్రానికి చెందినవారు.

2019లో హీరోయిన్‌గా అరంగేట్రం చేసింది. ఎక్కువగా తమిళ్, మలయాళం చిత్రాలలో హీరోయిన్గా నటిస్తూ భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న ఈమె.. ఇప్పుడు తొలి సారి తెలుగులో నటించబోతోంది. మరి ఈ సినిమా ఈమెకు ఎలాంటి సక్సెస్ అందిస్తుందో తెలియాల్సి ఉంది. ఏది ఏమైనా మలయాళం, తమిళ చిత్రాలలో భారీ పాపులారిటీ అందుకున్న ఈమెకు.. తెలుగు చిత్రాలు ఎలాంటి విజయాన్ని అందిస్తాయో చూడాలి. ఇకపోతే ప్రస్తుతం సెల్వ రాఘవన్ దర్శకత్వం వహిస్తున్న 7/జి రెయిన్బో కాలనీ 2 సినిమాలో నటిస్తోంది.

# రాజా సాబ్‌కు సర్కార్ షాక్ ఇస్తుందా.. ఆ పర్మిషన్ డౌటేనా?



యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న 'రాజా సాబ్' సినిమాపై మెల్లగా హైప్ అంతకంతకూ పెరిగుతోంది. రిలీజ్‌కి చాలా తక్కువ సమయం ఉండడంతో మేకర్స్ గ్యాప్ లేకుండా ప్రమోట్ చేస్తున్నారు. మారుతి దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాను సంక్రాంతి కానుకగా జనవరి 9న రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ఎప్పుడో ప్రకటించారు. అయితే రీసెంట్‌గా జరిగిన సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ ఫ్యాన్స్‌కు ఒక అదిరిపోయే న్యూస్ చెప్పారు. జనవరి 8వ తేదీనే ఈ సినిమా ప్రీమియర్స్ వేయబోతున్నామని ప్రకటించారు. దీంతో ఫ్యాన్స్ సంబరాలు చేసుకుంటున్నారు. నిర్మాత ప్రకటన చేయడం వరకు బాగానే ఉంది కానీ, అసలు దీనికి తెలంగాణ ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తుందా లేదా అనేదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ప్రస్తుతం ఉన్న పరిస్థితులు చూస్తుంటే పర్మిషన్ దొరకడం అంత ఈజీగా అనిపించడం లేదు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయాలు రాజా సాబ్‌కు ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. గతంలో పవన్ కళ్యాణ్ 'ఓజీ' సినిమా సమయంలో రెండు రాష్ట్రాల్లో ప్రీమియర్స్ కు అనుమతులు వచ్చాయి. కానీ ఆ తర్వాత సీన్ మారింది. టికెట్ రేట్లు ఇష్టారాజ్యంగా పెంచేసి ప్రీమియర్స్ వేస్తామంటే కుదరదని హైకోర్టు అక్షింతలు వేసింది. రీసెంట్‌గా బాలయ్య 'అఖండ 2' విషయంలో కూడా ఇదే జరిగింది. ప్రభుత్వం జీవో ఇచ్చినా, కోర్టు దాన్ని తప్పుబట్టింది. దీంతో ప్రీమియర్స్, రేట్ల పెంపు విషయంలో గందరగోళం ఏర్పడింది. దీనికి తోడు సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు రీసెంట్‌గా చాలా సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చారు. అధికారులు తెలియక పర్మిషన్లు ఇస్తున్నారని, ఇకపై రేట్లు పెంచమని గానీ, స్పెషల్ షోలు అడగమని గానీ తమ దగ్గరకు రావద్దని తేల్చిచెప్పారు. సినిమా అనేది సామాన్యుడి వినోదం అని, దాన్ని భారంగా మార్చకూడదని ప్రభుత్వం భావిస్తోంది. ఇలాంటి టైమ్‌లో రాజా సాబ్ టీమ్ ప్రీమియర్స్ ప్లాన్ చేయడం సాహసమే. నిర్మాత విశ్వప్రసాద్ మాత్రం చాలా నమ్మకంతో అనౌన్స్ చేశారు. బహుశా ప్రభుత్వం నుంచి ఏమైనా హామీ లభించిందేమో తెలియదు. కానీ ఒకవేళ పర్మిషన్ రాకపోతే మాత్రం ఫ్యాన్స్‌కు అది పెద్ద డిసప్పాయింట్మెంట్ అవుతుంది. హైదరాబాద్‌లో ఎర్లీ ప్రీమియర్స్ పడితే ఆ కిక్ వేరుగా ఉంటుంది, కలెక్షన్స్ కూడా భారీగా పెరుగుతాయి. కానీ సర్కార్ రూల్స్ దీనికి అడ్డుపడేలా ఉన్నాయి. ఏదేమైనా జనవరి 8న ప్రీమియర్స్ ఉంటాయా లేదా అనేది ప్రభుత్వం చేతిలోనే ఉంది. ప్రభాస్ రేంజ్ సినిమా కాబట్టి ఏమైనా మినహాయింపు ఇస్తారా, లేక పేదల ప్రభుత్వం అనే పాలసీకే కట్టుబడి ఉంటారా అనేది చూడాలి. ప్రస్తుతానికి అయితే రాజా సాబ్ ప్రీమియర్స్ వ్యవహారం ఒక సస్పెన్స్ థ్రిల్లర్‌లా నడుస్తోంది.

# 17 ఏళ్ల వైవాహిక బంధానికి స్వస్తి



సినిమా ఇండస్ట్రీలో సెలబ్రిటీల మధ్య ప్రేమ, పెళ్లి, విడాకులు అత్యంత సాధారణంగా మారిపోయాయి.. ఒకవైపు కొంతమంది సెలబ్రిటీలు పెళ్లి చేసుకుని కొత్త జీవితాన్ని ప్రారంభిస్తే...మరి కొంతమంది వైవాహిక బంధంలోకి అడుగు పెట్టిన 6 నెలలకే విడాకులు తీసుకున్న జంటలు ఉన్నాయి. మరికొంతమంది ఏళ్ల తరబడి వైవాహిక బంధంలో సంతోషంగా జీవించి పిల్లలకు జన్మనిచ్చిన తర్వాత.. ఇప్పుడు సడన్గా విడాకులు తీసుకొని అభిమానులను కూడా ఆశ్చర్యపరుస్తున్నారు. ఇప్పుడు అలాంటి వారి జాబితాలోకి ఒక టాలీవుడ్ హీరో చేరిపోయారు. 17 ఏళ్ల వైవాహిక బంధానికి స్వస్తి పలుకుతూ తన భార్యకు విడాకులు ఇచ్చారు..ఈ విషయాన్ని ఆయనే తన అధికారిక ఇంస్టాగ్రామ్ ఖాతా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఆయన ఎవరో కాదు ప్రముఖ మలయాళ నటుడు షిజు ఏఆర్. ఈయన తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితుడే. ముఖ్యంగా దేవి సినిమాతో ఇండస్ట్రీలో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈయన..అనేక తెలుగు చిత్రాలలో నటించి ప్రేక్షకులను మెప్పించారు.. ఇకపోతే ఇప్పటికే పలు చిత్రాలలో నటిస్తూ బిజీగా మారిన షిజు తాజాగా తన భార్యతో విడిపోయినట్లు వెల్లడించారు. ఆయన తన ఇంస్టాగ్రామ్ ఖాతా ద్వారా.. "నేను, ప్రీతి ప్రేమ్ పరస్పర అంగీకారంతోనే విడిపోవాలని నిర్ణయం తీసుకున్నాము. తాజాగా మాకు అధికారికంగా విడాకులు మంజూరయ్యాయి ..మేము భార్యాభర్తలుగా విడిపోయినా..మంచి స్నేహితుడుగా కొనసాగుతున్నాము. అయితే మా వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించవద్దని ప్రతి ఒక్కరిని కోరుతున్నాను.. ఇకపై మేము విడివిడిగా వ్యక్తిగత జీవితాన్ని గడుపుతాము..దయచేసి ఎటువంటి పుకార్లు సృష్టించవద్దు" అంటూ తెలిపారు. ఇకపోతే అనుకోకుండా కలిసిన ఈ జంట ఒకరికొకరు నువ్వంటే నాకిష్టం అంటూ సినిమా స్టైల్‌లో ప్రపోజ్ చేసుకున్నారు. అప్పటికి షిజు హీరోగా పనిచేస్తూ ఉండగా.. ప్రీతి ఎయిర్ హొస్టెస్‌గా పని చేస్తోంది. అయితే వీరిద్దరు తమ ప్రేమ గురించి ఇంట్లో చెప్పి పెళ్లి చేసుకోవాలనుకున్నారు. అయితే అతడు ముస్లిం.. ఆమె క్రిస్టియన్.. ఇంట్లో ఒప్పుకుంటారో లేదో అనే భయంతో ఇంట్లో అడిగి చూసింది. కానీ ఇద్దరి మతాలు వేరు కాబట్టి కుటుంబ సభ్యులు వ్యతిరేకించారు. మతం కంటే వ్యక్తిత్వం ముఖ్యమని భావించిన ప్రీతి.. ఎక్కువ ఆలస్యం చేయకుండా మూడు రోజుల్లోనే పెళ్లి చేసుకుందామని చెప్పిందట. వీరికి ఒక కూతురు కూడా ఉంది. కూతురు పుట్టాక కుటుంబ సభ్యులు అంగీకరించడంతో మళ్లీ కూతురు సమక్షంలో సాంప్రదాయ పద్ధతిలో వివాహం చేసుకున్నారు..అలాంటి ఈ జంట ఇప్పుడు 17 ఏళ్ల వైవాహిక బంధం తర్వాత తమ బంధానికి పులిస్టాప్ పెడుతూ విడిపోవడం పలు అనుమానాలకు దారి తీస్తోంది.

మతాలు వేరైనా ఒకరికొకరు ఇష్టపడి మరీ వివాహం చేసుకున్నారు.. అలాంటి ఈ జంట విడాకులు తీసుకోవడం ఏంటి? అని కొంతమంది కామెంట్లు చేస్తుంటే మరి కొంతమంది వయసుకు వచ్చిన అమ్మాయి ఇంట్లో ఉండగా.. ఇప్పుడు వీరు విడాకులు తీసుకుంటే.. ఆ అమ్మాయి మానసిక పరివర్తన పై ఈ విషయం ఎంత పెద్ద ప్రభావం చూపుతుందో వీరికి తెలియదా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి బంధానికి పులిస్టాప్ పెట్టడంతో అభిమానులు తట్టుకోలేకపోతున్నారు.

# రూమర్స్‌కి గట్టి కౌంటర్.. 60 కోట్ల స్కామ్ సంగతేంటి?




ముఖ్యంగా సోషల్ మీడియా వాడకం పెరిగిపోయిన తర్వాత సెలబ్రిటీలకు సంబంధించిన ఏ చిన్న విషయమైనా సరే ఇట్టే వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. అయితే అలా వైరల్ అయ్యే వార్తల్లో ఏది నిజమో ఏది అబద్దమో తెలియదు కానీ దానిపై మళ్ళీ ఆ సెలబ్రిటీలు స్పందించే వరకు ఆ రూమర్స్ వినిపిస్తూనే ఉంటాయి. ఈ క్రమంలోనే ప్రముఖ బాలీవుడ్ బ్యూటీ శిల్పా శెట్టి 60కోట్ల స్కామ్ లో ఇరుక్కున్న విషయం తెలిసిందే.. అయితే అవన్నీ అవాస్తవమని తమ ఇమేజ్‌ను డామేజ్ చేయడానికి కొంతమంది ఇలా రూమర్స్ స్ప్రెడ్ చేస్తున్నారు అంటూ ఎట్టకేలకు ఆ హీరోయిన్ స్పందించింది. మరి 60 కోట్ల స్కాం సంగతి ఏంటి ? అసలు ఏం జరిగింది? అనే విషయం ఇప్పుడు చూద్దాం.. విషయంలోకి వెళ్తే.. ముంబైకి చెందిన లోటస్ క్యాపిటల్ ఫైనాన్స్ సర్వీసెస్ డైరెక్టర్, వ్యాపారవేత్త అయిన దీపక్ కొఠారి.. శిల్పాశెట్టి దంపతులు తమ వ్యాపారాన్ని విస్తరిస్తామని చెప్పి తన దగ్గర డబ్బులు తీసుకున్నారని తెలిపారు. ఆయన మాట్లాడుతూ.." శిల్పా శెట్టి బెస్ట్ డీల్ టీవీ ప్రైవేట్ లిమిటెడ్ అనే హోం షాపింగ్ కంపెనీకి డైరెక్టర్ గా ఉంది.ఆ కంపెనీలో 87.6% శిల్పాశెట్టి దంపతులు వాటా కూడా కలిగి ఉన్నారు. ఈ విషయాన్ని నాకు చెప్పడంతో నేను ఈ దంపతులను నమ్మి 12% వడ్డీతో 75 కోట్లు అప్పు కావాలని అడిగితే 60 కోట్లు ఇచ్చాను. అయితే ఆ తర్వాత అధిక పన్నుల భారం నుండి తప్పించుకోవడానికి అప్పుగా కాకుండా పెట్టుబడిగా ఇవ్వాలని ఒప్పించారు. నెలకు వచ్చే రాబడితో పాటు అసలు కూడా తిరిగి చెల్లిస్తామని చెప్పి హామీ ఇవ్వడంతోనే 2015 – 2023 వరకు పెట్టుబడిగా పెట్టాను. అలా 2015 ఏప్రిల్ 31.9 కోట్లు.. అదే ఏడాది సెప్టెంబర్‌లో 28.53 కోట్లు శిల్పాశెట్టి దంపతులకు ఇచ్చాను. అయితే అదే సంవత్సరమే బెస్ట్ డీల్ టీవీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో డైరెక్టర్ పదవికి శిల్పా రిజైన్ చేసింది. ఇక వీరిని నమ్మి 60 కోట్లు నష్టపోయాను " అంటూ దీపక్ కొఠారి పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇచ్చారు. ఈ ఫిర్యాదును విచారణ చేసిన పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఆర్థిక నేరాల విభాగానికి ఈ కేస్‌ను బదిలీ చేసిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం ఈ కేస్ కోర్టులో నడుస్తుండగా.. దీనిపై శిల్పాశెట్టి స్పందించింది. ముఖ్యంగా రూ.60 కోట్ల స్కాం విషయంలో తనను పెట్టుబడిగా పెట్టాలని ప్రేరేపించారని కొఠారి ఆరోపించిన నేపథ్యంలో ఆగస్టు 14న ఈ కేసు నమోదు అవ్వగా.. వ్యాపార కార్యకలాపాల కోసం ఉద్దేశించిన నిధులను వ్యక్తిగత అవసరాల కోసం ఉపయోగించారని ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలే ఎఫ్ఐఆర్‌లో చేర్చబడ్డాయి. ముఖ్యంగా రాజ్ కుంద్రా తన డబ్బులో కొంత భాగాన్ని నటులు బిపాసా బసు, నేహా ధూపియాలకు ప్రొఫెషనల్ ఫీజుగా చెల్లించారని, బెస్ట్ డీల్ టీవీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ 2016లో నోట్ల రద్దు తర్వాత తీవ్ర నష్టాలు చవిచూసిందని, దీనివల్ల ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయని, పెట్టుబడి పెట్టిన మొత్తాన్ని తిరిగి చెల్లించలేం అని కూడా రాజ్ కుంద్రా వాదించారు అంటూ అభియోగాలు వస్తున్న నేపథ్యంలో శిల్పా శెట్టి తాజాగా తన సోషల్ మీడియా ఖాతా ద్వారా ఒక ప్రకటన విడుదల చేస్తూ ఆరోపణలను ఖండించారు. "తాజాగా వస్తున్న వార్తలు నిరాధారమైనవి. ఇవి ఎవరో కావాలని చేస్తున్నారు. చట్టబద్ధమైన కారణాలు లేకుండా ఈ వివాదానికి నేరపూరిత రంగు వేస్తున్నారు. ఇప్పటికే హైకోర్టులో రద్దు పిటిషన్ వేసాము..అది పెండింగ్లో ఉంది. ప్రస్తుతం ఈ విషయం విచారణలో ఉన్న నేపథ్యంలో మీడియా ఊహాగానాలకు దూరంగా ఉండండి.. రూమర్స్‌ని ఎట్టి పరిస్థితుల్లో నమ్మకండి" అంటూ ఆమె తెలిపింది. తాను, తన భర్త పూర్తిగా దర్యాప్తుకు సహకరిస్తున్నామని, న్యాయ ప్రక్రియపై తమకు విశ్వాసం ఉందని శిల్పా శెట్టి తెలిపింది.. ప్రస్తుతం ఇంస్టాగ్రామ్ స్టేటస్ ద్వారా ఈమె పెట్టిన ఈ పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోంది.

# ప్రపంచానికే ఆదర్శం మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుసిటీ

## - టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర అభివృద్ధికి, పురోగామికి కూటమి ప్రభుత్వం ఎంతలా కృషి చేస్తుందో చెప్ప డానికి నిదర్శనమే మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుసిటీ రూపకల్పన అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియో జకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. భీమిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గంటా నూకరాజు బుధవారం మీడియాతో మాట్లాడారు. జిఎమ్ఆర్, మాన్సాస్ సంస్థ సహాయ సహకారంతో భోగాపురంలో ఏర్పాటు చేయబోయే ఏవియేషన్ ఎడ్యుసిటీ ప్రపంచానికే ఆదర్శమని అన్నారు. ఈ రాష్ట్రంలో ఉండే యువత కోసం 136 ఎకరాలు భూమిని మాన్సాస్ సంస్థ ప్రతినిధి, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు ఏవియేషన్ నిర్మాణానికి ఉచితంగా ఇవ్వడం చాలా గొప్ప విషయమని అన్నారు. ఆ సంస్థ ప్రతినిధులకు తెలుగు ప్రజలతో పాటు ప్రతీ భారతీయుడు రుణపడి ఉంటారని అన్నారు. మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుసిటీ నిర్మాణం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఇక్కడే యువతకు ఏవియేషన్ కోర్సులో భాగమైన పైలెట్ శిక్షణ, ఎయిర్ క్రాఫ్ట్ మెయింటినెన్స్, ఏవియేషన్ మేనేజ్మెంట్ మరియు ఎయిర్ క్రాఫ్ట్ కంట్రోల్‌తో సహా విమాన యాన సర్వీసుకు ఉపయోగపడే శిక్షణ తరగతుల నిలయంగా భోగాపురం మారుతుందని అన్నారు. ఇది ప్రతీ తెలుగువాడు గర్వంగా తలెత్తి చెప్పుకొనే విషయమని అన్నారు. రాష్ట్రం పురోభివృద్ధికి, యువతకు ఉపాధి అవకాశాలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఏవియేషన్ వర్క్ పోర్సులో కనీసం 70 శాతం తెలుగువారే లక్ష్యంగా చేసుకొని చేపట్టడం గర్వించవలసిన విషయమని అన్నారు. ఈ అపురూప పథకానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, ఐటి శాఖామంత్రి నారా లోకేష్‌కి, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకి, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతి రాజుకి ప్రతీ తెలుగువారి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని గంటా నూకరాజు అన్నారు.

# మరుపల్లి వద్ద జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

## - ప్రమాదంలో ఐదుగురికి గాయాలు - గాయపడిన వారిని చికిత్స నిమిత్తం గజపతినగరం ఏరియా ఆసుపత్రికి తరలింపు : ఎస్.ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు






**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలో గల మరుపల్లి జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి.
స్థానిక ఎస్సై కె.కిరణ్ కుమార్ నాయుడు విలేకరులకు అందించిన వివరాలు ప్రకారం, సోమవా రం రాత్రి మరుపల్లి గ్రామ జంక్షన్ వద్ద లగ్జరీ ఆర్టీసీ ఎ.పి40 జెడ్ 0378 నెంబర్ గల బస్సు, కొంత సమయం ఆగిన తర్వాత వెనకకు తీస్తున్న సమయంలో బస్సును వెనక నుంచి వస్తున్న లారీ (నెంబర్ OD 18F 2219) బలంగా ఢీ కొట్టింది.
ఈ క్రమంలో మోటార్ సైక్లిస్ట్ కూడా వేగంగా వచ్చి ఢీకొన్నాడు. దీంతో మొత్తంగా డ్రైవర్‌తో సహా నలుగురు గాయపడ్డారు. గాయపడ్డ ఐదుగురిని గజపతినగరం ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించడం జరిగిందని ఎస్.ఐ కే కిరణ్ కుమార్ నాయుడు తెలియజేశారు. బస్సు డ్రైవర్ సూర్య ప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# ప్రింట్ మీడియా బలోపేతం కావాలి

## - గోవిందపురం వనసమారాధనలో అతిథులు







**భీమిలి, (రాజధాని వార్తలు):** ప్రింట్ మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమిలి తగరపువలసకు చెందిన పత్రికా విలేకరులు గోవిందపురం దగ్గర పి ఎల్ ఆర్ ఎస్టేట్స్ లేఔట్‌లో ఘనంగా వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో అన్ని పార్టీల నాయకులు హాజరై ప్రింట్ మీడియా సభ్యులందరికీ తమ సంఘీభావం తెలియజేశారు. ఈ వనసమరాధన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, వైసీపీ మూడవ వార్డ్ అధ్యక్షులు మైలపల్లి షణ్ముఖరావు, ఒకటో వార్డు జనసేన అధ్యక్షురాలు పరిమి భువనేశ్వరి, విజయనగరం జిల్లా మోదవలస గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు ఎర్నింటి కిట్టూ ఈ వనసమారాధన కార్యక్రమంలో పాల్గొని పాత్రికేయుల పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య సంధానకర్తలుగా విలేకరులు పాత్ర అద్వితీయమైందని ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేసే భాగంలో విలేకరుల పాత్ర కీలకమైందని అన్నారు సాంకేతికత ఎంత పెరిగినా, ఎలక్ట్రానిక్ మీడియా ఎంత అభివృద్ధి చెందినా, ప్రింట్ మీడియాకు ఉన్న విలువ ఎప్పటికీ తగ్గదని నూకరాజు అన్నారు. మూడో వార్డ్ వైసిపి అధ్యక్షులు మైలపల్లి షణ్ముఖరావు మాట్లాడుతూ ప్రింట్ మీడియా వలన మనం ఎవరు అన్నది తెలుస్తుందని నేను పది మందికి పరిచయం అయ్యానంటే అది ప్రింట్ మీడియా వలనే అని తెలిపారు ప్రజా సమస్యలను ప్రభుత్వానికి చేరవేయడంలో విలేకరుల పాత్ర కీలకమని అన్నారు. విలేకరులందరూ ఐకమత్యంతో ముందుకు వెళ్లాలని విలేకరులందరూ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఒకటో వార్డ్ జనసేన అధ్యక్షురాలు పరిమి భువనేశ్వరి మాట్లాడుతూ ప్రింట్ మీడియా ఎల్లవేళలా నేను చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు తమ పేపర్ ద్వారా తెలియపరుస్తున్నారని తనను ఆహ్వానించిన అసోసియేషన్ ప్రతినిధులకు అభినందనలు తెలియజేశారు. విలేఖరులంటే నాకు ఎంతో గౌరవమని ఆమె తెలిపారు.
వైసీపీ నాయకుడు ఎర్నింటి కిట్టూ మాట్లాడుతూ విలేఖరులకు సమాజంలో ప్రత్యేక స్థానం ఉందని, సమస్యలను ఎత్తిచూపే విలేఖరులంటే తనకు ప్రత్యేక గౌరవమని అన్నారు. ప్రింట్ మీడియా అసోసియేషన్ వారంతా ఐకమత్యంతో ముందుకు వెళ్లాలని, సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. అనంతరం ప్రింట్ మీడియా సభ్యులందరినీ మైలపల్లి షణ్ముఖరావు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో భీమిలి ప్రింట్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు కె ఆర్ ఎం మోహనరావు (బుల్లి), కార్యదర్శి సుత్తి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు లచ్చుబుగత గణపతిరావు, కోశాధికారి ఆరంగి రోజా, జాయింట్ సెక్రటరీ ముద్దాడ రాజు, కార్యనిర్వాహక కార్యదర్శి రాజేటి బసవ కృష్ణమూర్తి, కార్యవర్గ సభ్యులు కిమిడి చిరంజీవి, ముసునూరి సూర్య శ్రీనివాస్, వినోద్, భాగం లక్ష్మి, పుక్కళ్ళ కరుణ సీనియర్ విలేఖరి రంగధామారావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం ఏరియా వెల్ బేబీ షో కార్యక్రమం

**కొత్తగూడెం, (రాజధాని వార్తలు):** సింగరేణి దినోత్సవ వేడుకలు–2025లో బాగంగా ఉద్యోగుల పిల్లలకు వెల్ బేబీ షో కార్యక్రమము (గురువారం ఉదయం.09.00 లకు రుద్రంపూర్ డిస్పెంసరి నందు కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో నిర్వహించుకోబడుతుందని ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొత్తగూడెం ఏరియా సేవా అధ్యక్షురాలు జి మధురవాణి హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు పత్రికా ప్రకటనలో భాగంగా తెలియజేశారు. ఈ కార్యక్రమములో పాల్గొనుటకు ఆసక్తి గల పిల్లలు ఉన్న ఉద్యోగులు వారి వివరములు, పిల్లల జన్మదిన ధృవీకరణ పత్రము, టీకా నమోదు సమాచారముతో 18 గురువారం ఉదయం.09.00 లకు రుద్రంపూర్ డిస్పెంసరికి తీసుకొని రావాలని వెల్ బేబీ షో కార్యక్రమములో గెలుపొందిన వారికి ఈ క్రింద తెలిపిన కేటగిరీలలో బహుమతులు తేదీ.23 డిసెంబర్ నాడు ప్రగతివనం, రుద్రంపూర్ నందు నిర్వహించుకొనే సింగరేణి దినోత్సవము వేడుకలలో బహుకరించడం జరుగుతుందని.1. బేబీ కింగ్ 2. బేబీ క్వీన్ 3. ప్రిన్స్ – 1 , 4. ప్రిన్స్ – 2,5. ప్రిన్సెస్ – 1,6. ప్రిన్సెస్ – 2 గా బహుమతులు ఇవ్వడం అవుతుందని ఆసక్తి గల పిల్లలు ఉన్న ఉద్యోగులు ఈ కార్యక్రమానికి హాజరవ్వాలని తెలియజేశారు. అలాగే వెల్ బేబీ షో కార్యక్రమములో పాల్గొనే పిల్లల వయస్సు 1 సం. నుండి 5 సంవత్సరాలలోపు ఉన్నవారు అర్హులని ఈ సందర్భంగా తెలియజేశారు.




# మావుడి సోదరులను పరామర్శించిన శత్రుచర్ల పరీక్షిత్ రాజు



**మక్కువ, (రాజధాని వార్తలు):** మక్కువ మండలం వైఎస్ఆర్సిపి నాయకులు మావుడి సోదరులను మంగళవారం వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజ్ పరామర్శించారు. జడ్పిటీసి సభ్యులు మావుడి శ్రీనివాసరావు, వైయస్సార్సీపీ మండల అధ్యక్షులు మావుడి రంగునాయుడు, డిసిసిబి మాజీ డైరెక్టర్ మావుడి తిరుపతినాయుడు, మాతృమూర్తి మావుడి అరుణమ్మ ఇటీవల స్వర్గస్తురాలైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మావుడి సోదరుల ఇంటికి చేరుకుని మావుడి సోదరులకు అరుణమ్మ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో మండల వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

# రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** ఈనెల 19వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గజపతినగరం సబ్ స్టేషన్ మరమ్మత్తు పనుల్లో భాగంగా పెయింటింగ్ వేయు కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు బొబ్బిలి డివిజన్ కార్యనిర్వహక ఇంజనీర్ బి.రఘు బుధవారం తెలిపారు. మండలంలోని గంగచోళ పెంట, పట్రువాడ, కొత్త బగ్గాము, పాత బగ్గాము, బంగారమ్మపేట, భూదేవిపేట, దావాలపేట, బూడిపేట, కొనిస, మెంటాడ, మర్రి వలస, సాలిపేట, చిట్టయ్యవలస, మధుపడ ,మరుపల్లి, తమ్మారాయుడిపేట, గుడివాడ, ఎన్జీఆర్ పురం, శ్రీరంగరాజపురం, ఎం. వెంకటాపురం, గజపతినగరం, పురిటిపెంట, సీతారాంపురం, పిడిసిల, గ్రామాలకు ఈ విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని గ్రహించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# శాస్త్రీయ దృక్పథం పెంపొందించడంలో ఎగ్జిబిషన్ల కీలక పాత్ర

## - జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యం నాయుడు





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత పెంపొందించడంలో సైన్స్ ఎగ్జిబిషన్లు కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యం నాయుడు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు రూపొందించిన నమూనాలు, ప్రాజెక్టులు భవిష్యత్ ఆవిష్కరణలకు పునాది అవుతాయని అన్నారు. అనంతరం ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను పరిశీలించి, విద్యార్థుల వివరణాత్మకమైన విశ్లేషణకు ముగ్ధులయ్యారు. విద్యార్థులను అభినందించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థుల తరగతి గదిలోకి వెళ్లి వందరోజుల యాక్షన్ ప్లాన్‌పై ఆరా తీశారు. విద్యార్థులను పలు సబ్జెక్టులపై ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సి.హెచ్. రమేష్ కుమార్, ఎంఈఓ2 బి.సాయిచక్రధర్, సైన్స్ ఉపాధ్యాయులు ఎ.శ్రీదేవి, ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహం స్థాపనకు సింగరేణి బీసీ ఉద్యోగుల సంఘం వినతి

**కొత్తగూడెం, (రాజధాని వార్తలు):** సింగరేణి బీసీ ఉద్యోగుల సంఘం, మణుగూరు ఆధ్వర్యంలో, పీవీ కాలనీ, మణుగూరులో మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహం స్థాపించేందుకు, మణుగూరు ఏరియా ఎస్ఓ టు జీఎంకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. మహాత్మా జ్యోతిబా పూలే సావిత్రిబాయి పూలేతో కలిసి సమాజ సంస్కరణ, విద్యా వ్యాప్తి, మహిళా సాధికారత మరియు సామాజిక సమానత్వం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహానీయుడని ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ఆయన విగ్రహం స్థాపన వలన ఉద్యోగులు, యువత మరియు విద్యార్థులకు ప్రేరణ లభించడంతో పాటు సమానత్వం, న్యాయం వంటి విలువలు మరింత బలపడతాయని తెలిపారు. ప్రస్తుతం మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహం అందుబాటులో లేకపోవడం వల్ల, ఆయన జయంతి మరియు వర్ధంతి కార్యక్రమాలను ప్రతి సంవత్సరం వేర్వేరు ప్రదేశాలలో నిర్వహించాల్సి వస్తోందని, దీనివల్ల అనేక అసౌకర్యాలు ఎదురవుతున్నాయని సంఘం పేర్కొంది. ఒక నిర్దిష్ట ప్రదేశంలో విగ్రహం స్థాపన జరిగితే ఈ కార్యక్రమాలను గౌరవప్రదంగా, సక్రమంగా నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని అభిప్రాయపడింది. ఈ సందర్భంగా ఎస్ఓ టు జీఎం శ్రీనివాస్ చారి, మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహం ఏర్పాటు విషయాన్ని జనరల్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లి, అనుమతి వచ్చేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి బీసీ ఉద్యోగుల సంఘం కేంద్ర కమిటీ, ప్రాంతీయ కమిటీ సభ్యులు మరియు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ కోనసీమ జిల్లా టిడిపి అధ్యక్షుడిగా గుత్తుల సాయి



**ముమ్మిడివరం, (రాజధాని వార్తలు):** డాక్టర్. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా గుత్తుల సాయి పేరును అధిష్టానం ఖరారు చేసింది. ముమ్మిడివరం మండలం గాడిలంక గ్రామానికి చెందిన ఆయనకు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉంది. గాడిలంక సర్పంచ్ గాను, 2000 లో ముమ్మిడివరం ఎంపీపీగా, 2005లో పి.గన్నవరం జడ్పిటిసిగా ఆయన బాధ్యతలు నిర్వహించారు. ఆ సమయంలో జెడ్పీ ఛైర్మన్ పదవి అందినట్లే అంది చేజారింది. 2009లో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించి బంగపడడంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి 33 వేలకు పైగా ఓట్లు సాధించారు. 2014లో వైసిపి తరుపున పోటీ చేసి అపజయం పాలయ్యారు. అనంతరం టిడిపిలో క్రియాశీలక సభ్యుడిగా కొనసాగుతున్నారు. అన్ని సామాజిక వర్గాలతో సత్సంబంధాలు కలిగిన సాయికి జిల్లా అధ్యక్షుడు పదవి వరించడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ఆయన్ను అధ్యక్షుడుగా నియమించడంలో కోనసీమ జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీ, మంత్రి పూర్తి మద్దతు ప్రకటించడంతో ఆయన నియామకం సులభమైంది.

# ఆర్ కృష్ణయ్య జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముద్దాడ గణేష్ భవాని యాదవ్ ఆధ్వర్యంలో మెరిట్ విద్యార్థులకు ఎంక్రేజ్‌మెంటు అవార్డులు ప్రదానం





**పాలకొల్లు, (రాజధాని వార్తలు):** ఆర్ కృష్ణయ్య జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాల్ నందు రాష్ట్ర అధ్యక్షులు ముద్దాడ గణేష్ భవాని యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి పాలకొల్లు మార్కెట్ యార్డు చైర్మన్ కోడి విజయభాస్కర్ పాల్గొని ప్రసంగించి విద్యార్థులకు ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా 300 మంది విద్యార్థులకు ఎంక్రేజ్‌మెంటు అవార్డులు (మెమోటస్) అందించి అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్మిక విభాగ అధ్యక్షులు శిడగం రవి శేఖర్, నరసాపురం డివిజన్ అధ్యక్షులు బురాబత్తుల రాంబాబు, చేనేత కులాల రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బీరక ప్రసాద్, పాలకొల్లు నియోజకవర్గ మహిళ ప్రధాన కార్యదర్శి పాలవలస నాగ విజయలక్ష్మి, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు పెడుతుంది : ఎమ్మెల్యే బండారు

**కొత్తపేట, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలంలో రూ.1.17 కోట్లతో తలపెట్టిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో వాడవాడల అభివృద్ధి పరుగులు పెడుతోంది అన్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలో కూటమి అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెడుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన ఆత్రేయపురం మండలంలోని పలు గ్రామాల్లో రూ. 1.17 కోట్లతో తలపెట్టిన అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా మెర్లపాలెంలో జల జీవన్ మిషన్ నిధులు రూ.23.60 లక్షలతో తలపెట్టిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. అనంతరం ఆత్రేయపురంలో ఏపీ ఎస్ఎస్ నిధులు రూ.53 లక్షలతో నిర్మించనున్న మండల విద్యా శాఖ అధికారి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తరువాత వద్దిపర్రు గ్రామంలో ప్రధానమంత్రి గ్రామీణ యోజన నిధులు రూ.20 లక్షలతో తలపెట్టిన సీసీ డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన



చేశారు. అనంతరం బొబ్బర్లంకలో రూ.20.50 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో తలపెట్టిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్), కాయల జగన్నాధం, ముళ్ళపూడి భాస్కరరావు, కుసంపూడి రామకృష్ణంరాజు, సర్పంచ్‌లు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సత్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్ బొత్స సందీప్ జన్మదినోత్సవం





**విజయనగరం, (రాజధాని వార్తలు):** సత్య విద్యా సంస్థల ఎన్‌సి సి విభాగం ఆధ్వర్యంలో సత్య విద్యా సంస్థల మేనేజింగ్ ట్రస్టీ సభ్యులు మరియు ధీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బొత్స సందీప్ జన్మదిన వేడుకలు సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ప్రేమ సమాజంలోని వృద్ధులు, నిరాశ్రయులకు అన్నదానం నిర్వహించడంతో పాటు పండ్లు పంపిణీ చేశారు. అలాగే మహిళలకు చీరలు పంపిణీ చేసి మానవీయ సేవా భావాన్ని చాటారు. అదేవిధంగా విజయనగరం పట్టణంలోని అంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు పండ్ల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమాల ద్వారా డాక్టర్ బొత్స సందీప్ సేవే పరమ ధర్మం అనే నినాదాన్ని ఆచరణలో చూపించారని పాల్గొన్నవారు ప్రశంసించారు. డాక్టర్ బొత్స అనూష మాట్లాడుతూ తన తమ్ముడు జన్మదినాన్ని ఆనందోత్సవంగా కాకుండా సమాజ సేవకు అంకితం చేయడం ఎంతో సంతృప్తినిస్తోందని తెలిపారు. పేదల చిరునవ్వే తనకు నిజమైన ఆశీర్వాదమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో సందీప్ మేనమామలు సి.మజ్జి శ్రీనివాస్, మజ్జి ఆనంద్, కేసలి అప్పారావు పాల్గొన్నారు.

# టిడిపి జిల్లా అధ్యక్షుడిగా గుత్తుల సాయి

## - సాయి నియమాకం పట్ల పలువురి హర్షం



**ముమ్మిడివరం, (రాజధాని వార్తలు):** అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా ఎన్నో తర్జన భర్జనల మధ్య పార్టీ శ్రేణుల అభిప్రాయాలు కనుగుణంగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ గుత్తుల సాయిని నియమించింది. గుత్తుల సాయిని నియమాకం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గానికి చెందిన గుత్తుల సాయి గతంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ సెక్రటరీగా పనిచేశారు. ప్రస్తుతం నర్సాపురం నియోజకవర్గం పార్టీ పరిశీలకులుగా వ్యవహరిస్తున్నారు. ఈయన పార్టీకి అందించిన సేవలను గుర్తించి జిల్లా పార్టీ అధ్యక్షులుగా నియమించారు. బీసీ శెట్టిబలిజ వర్గానికి చెందిన గుత్తుల సాయి 1987వ సంవత్సరము నుండి క్రియాశీలక రాజకీయాలలో పాల్గొంటున్నారు. 1996లో సర్పంచ్‌గా మొదటిసారి ఎన్నికయ్యారు. సర్పంచిగా ఉంటూనే 2001లో ముమ్మిడివరం మండల ఎంపీపీగా 2006లో జడ్పిటిసిగా చేశారు. 1996 నుండి 2011 వరకు 15 సంవత్సరాలు పాటు వరుసగా పదవుల్లో కొనసాగారు. ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రజలచే ఎన్నుకోబడి ముమ్మిడివరం నియోజకవర్గంలో శెట్టిబలిజ సమాజ్యవర్గంలో బలమైన నాయకుడిగా ఎదిగారు. ఆ తదుపరి 2009లో ముమ్మిడివరం నియోజకవర్గం అసెంబ్లీ అభ్యర్థిగా ఇండిపెండెంట్‌గా పోటీ చేశారు. 2014లో వైయస్సార్‌సిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. 2016లో తెలుగుదేశం పార్టీలో చేరి అప్పటినుండి క్రియాశీలకంగా వ్యవహరిస్తూ ముమ్మడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు రాజుకు అండదండలు అందిస్తూ వస్తున్నారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌తోను అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్‌తోను సన్నిహిత సంబంధాలు ఉండడంతో పార్టీ అధ్యక్షుడు ఎంపికకు దోహదపడ్డాయని పార్టీ శ్రేణులు అంటున్నారు. సీనియర్ నాయకులు అనుభవజ్ఞులు సౌమ్యుడు వివాదారహితుడు అయిన గుత్తుల సాయి నియమాకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కొత్తపేట టిడిపి సీనియర్ నాయకులు గుబ్బల మూర్తి గుత్తుల సాయికి అభినందనలు తెలియజేసారు.

# ప్రతీ కార్యాలయంలో పి.జి.ఆర్.ఎస్ సెల్ : జిల్లా రెవెన్యూ అధికారి మురళి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రతీ ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో పిజిఆర్ఎస్ సెల్‌ను ఏర్పాటు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మురళి సూచించారు. పిజిఆర్ఎస్ వినతులపై కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆయన బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మురళి మాట్లాడుతూ ప్రతీ శాఖలో పిజిఆర్ఎస్ సెల్‌ను ఏర్పాటు చేయడం ద్వారా అర్జీదారులు తాము ఇచ్చిన అర్జీపై సంబంధిత అధికారులు తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొనే అవకాశం ఉంటుందన్నారు. దీనివల్ల వీరు మళ్లీమళ్లీ గ్రీవెన్స్‌కు వచ్చే పరిస్థితి ఉండదని చెప్పారు. ఈ దిశగా ప్రతీ శాఖా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అదేవిధంగా ఫిర్యాదుదారులు సంతృప్తి చెందే విధంగా వారి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఫిర్యాదుదారులపట్ల సానుకూల దృక్పథాన్ని చూపాలని, వారికి పరిస్థితిని పూర్తిగా వివరించాలని సూచించారు. అసంతృప్తి వ్యక్తం చేసిన వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి, అందుకు కారణాలను విశ్లేషించాలని చెప్పారు. శాఖాధిపతులు కూడా దీనిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ముఖ్యంగా కోఆర్డినేటర్స్ మధ్య వ్యత్యాసాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని, అందువల్ల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వీరికి శనివారం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని డి.ఆర్.ఓ తెలిపారు.

# హజరత్ జూమ్లే షా పీర్ దర్గా ఉరుసు ఉత్సవాల గోడ పత్రికలు ఆవిష్కరించిన బొజ్జల బృందమ్మ

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** దర్గా పీఠాధిపతి సయ్యద్ అహ్మద్ దర్గా నిర్వాహకుల సయ్యద్ బాబా ఫరీద్ వారి ఆధ్వర్యంలో హజరత్ జూమ్లే షా పీర్ దర్గా ఉరుసు ఉత్సవాల గోడ పత్రికలను శాసన సభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ చేతులు మీదుగా గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఈనెల 25 నుండి 28 వరకు శ్రీకాళహస్తి పానగల్ దర్గా వీధిలో గందోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జయచంద్ర నాయుడు, దర్గా ఉరుసు కమిటీ ప్రెసిడెంట్ ఓరుగంటి నాగేశ్వర రావు, గుమ్మల్ల రాజేశ్వరరావు, గరికపాటి రమేష్ బాబు, ఎంఎస్ జమురుద్, బాద్షా, బుజ్జి, మునీర్ భాషా, మొహమ్మద్ అన్సర్,



రహీం ఖాన్, కే.ఉదయ్ భాస్కర్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

# ఊరూరా పశుగ్రాస కేంద్రాలు : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి

**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఊరూరా పశుగ్రాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి కోరారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం నుంచి ముఖ్యమంత్రితో కలెక్టర్ల సమావేశం ప్రారంభమయ్యింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో పశుగ్రాస కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా పాడి పరిశ్రమ వృద్ధి చెందుతుందని సూచించారు. తద్వారా పాల ఉత్పత్తి పెరగడమే కాకుండా, గ్రామీణ ప్రజల ఆర్థిక పరిస్థితి బలోపేతం అవుతుందని అన్నారు. పశుగ్రాసం పెంచడానికి ప్రభుత్వనుంచి ప్రోత్సాహాలను అందించాలని కోరారు. 2016-2019 మధ్య ఈ పథకం అమలయ్యిందని ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తు చేశారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ, ఈ



ప్రతిపాదనను పరిశీలించాలని సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యన్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎన్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# కొండ బిట్రగుంట సమీపంలో జాతీయ రహదారిపై అండర్ పాస్ ఏర్పాటు చేయండి

**- చిన్న తిరుమలగా కొండ బిట్రగుంట ఆలయం ప్రసిద్ధి చెందింది - ఆలయానికి నిత్యం భక్తులు వస్తుంటారు. బ్రహ్మోత్సవాల సమయంలో ఈ సంఖ్య అధికం - ఈ ముంగమూరు తోటలు ప్రాంతంలో నిత్యం రహదారి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి - కొండ బిట్రగుంటకు వెళ్ళే ముంగమూరు తోటలు ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్‌గా గుర్తించండి - భక్తుల రక్షణకు సరైన భద్రతా చర్యలు చేపట్టండి - కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వినతి**



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం కొండ బిట్రగుంట ఆలయానికి వస్తున్న భక్తుల రక్షణార్థం జాతీయ రహదారిపై కొండ బిట్రగుంట సమీపంలోని ముంగమూరు తోటలు సెంటర్ వద్ద వెహికల్ పాస్ ఏర్పాటు చేయాలని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కేంద్ర జాతీయ రహదారులు శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి విన్నవించారు. అలాగే ఈ ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్‌గా గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసిన ఆయన ఇక్కడ తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. బోగోలు మండలంలో జాతీయ రహదారి-16 నుండి 5 కి.మీ దూరంలో, శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం అనే ప్రసిద్ధ ఆలయం ఉందన్నారు. ఈ ఆలయానికి తమిళనాడు రాష్ట్రం, నెల్లూరు, అల్లూరు, కావలి మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తుంటారని, దాంతో ఇది మరో తిరుమలగా ప్రసిద్ధి చెందిందన్నారు. వార్షిక బ్రహ్మోత్సవాల సమయంలో ప్రతిరోజూ సుమారు 20,000 మంది భక్తులు ఆలయాన్ని సందర్శిస్తారనీ తెలిపారు. భక్తులు ఆలయానికి వెళ్లడానికి ఎన్‌హెచ్-16 నుండి కొండ బిట్రగుంట బ్రాంచ్ రోడ్డుకు మళ్ళించారని, ఈ జంక్షన్‌ను ముంగమూరు తోటలు సెంటర్‌గా పిలుస్తారని పేర్కొన్నారు. ప్రస్తుతం ముంగమూరు తోటల సెంటర్ వద్ద ఉన్న జంక్షన్ ప్రధాన ట్రాఫిక్ పాయింట్‌గా మారిందని, దీంతో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ జంక్షన్‌లో భారీ ట్రాఫిక్ దృష్ట్యా, కొండ బిట్రగుంట బ్రాచ్ రోడ్డులోకి ప్రవేశించడానికి జాతీయ రహదారికి అవతలి వైపు దాటేటప్పుడు తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయనీ, కొన్ని సంవత్సరాల్లో దాదాపు 500 కి పైగా ప్రమాదాలు జరిగాయనీ, పేర్కొన్నారు. దాంతో ప్రజలు/భక్తులు ప్రాణాలు కోల్పోయారని, చాలా మందికి తీవ్రగాయాలు అయ్యాయని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని బోగోలు మండలం, ఎన్‌హెచ్-16లోని ముంగమూరు తోటల సెంటర్ జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ వెహికల్ అండర్ పాస్ నిర్మాణానికి ఆమోదం తెలియజేయాలని అభ్యర్థించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ.. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# హైందవ వీర్ ప్రసాద్‌పై చర్యలకు ఫిర్యాదు



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** క్రైస్తవ మతాన్ని విమర్శిస్తూ, పరిశుద్ధ గ్రంథమైన బైబిల్‌ను అవమానపరిస్తూ క్రైస్తవుల మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యాఖ్యలు చేసిన హైందవ వీర్ ప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలంటూ పెద్దాపురం పట్టణం మండలానికి చెందిన పాస్టర్ల నాయకులు పెద్దాపురం డి.ఎస్.పికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రెవ. బి.జాన్ సునందన్, రెవ. డా. పురుషోత్తం దాస్ లంక, బిషప్. డా. బ్లెస్సింగ్, బిషప్. డా.సి.బి.ఐ. సుకుమార్ తదితరులు మాట్లాడుతూ ఇటీవల హైందవ వీర్ ప్రసాద్ అనే వ్యక్తి బైబిల్‌ను అవమాన పరుస్తూ, క్రైస్తవ ప్రజలను కించపరుస్తూ క్రైస్తవ మనోభావాలను దెబ్బతీసే విధంగా దుర్భాషలాడుతూ క్రైస్తవుల పట్ల వ్యతిరేక కార్యక్రమాలు చేపడుతున్నట్టు తమ దృష్టికి రావడంతో ఆ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆ విధంగా దుశ్చర్యలకు పాల్పడుతున్న హైందవ వేర్ ప్రసాద్‌పై పోలీస్ అధికారులు తగిన చర్యలు తీసుకుని ప్రజలకున్న మత స్వాతంత్రపు హక్కు ప్రజలు వినియోగించుకునేలా అవకాశం కల్పించా లని అధికారులను కోరుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంకా రెవ. టి.దేవదాస్, రెవ. జి. మధుకిరణ్, రెవ. జి.చందు స్టీఫెన్, బ్రదర్. పి. జనార్ధన్ రావు, రెవ. కేఫా, రెవ. కె.జిమ్స్, రెవ. ఏ.చంటి, రెవ. వి. జాన్, రెవ. కె. జయబాబు, రెవ. నవజీవన్ రాజు, రెవ. పి. డేవిడ్ రాజు, పాస్టర్. టి.నాని, రెవ. ఎల్. జ్ఞానానందం, రెవ. విల్సన్, రెవ. బి. భాస్కర్, బ్రదర్. శ్రీను, పాస్టర్. జి. విక్టర్ ప్రేమ్ సాగర్ మరియు పెద్దాపురం, సామర్లకోట మండలాల పరిధిలోని పాస్టర్లు పాల్గొన్నారు.

# నడకుదురులో పరిశుభ్రత చర్యలు పరిశీలించిన డీడీఓ వాసుదేవరావు

**- పరిశుభ్రతే గ్రామ అభివృద్ధికి పునాది : అధికారులు**





**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలం నడకుదురులో పరిశుభ్రత చర్యలను డీడీఓ వాసుదేవరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జటావల్లభుల శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీఓ సలాది వెంకట శ్రీనివాసరావుతో కలిసి గ్రామ పంచాయతీని సందర్శించి, ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రజల్లో పరిశుభ్రత అవగాహన పెంపొందించే చర్యలపై పంచాయతీ అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. ప్రతి ఇంటి వద్ద రోజువారీ చెత్తను సకాలంలో సేకరించడంతో పాటు, పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని గ్రామస్తులను కోరారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పద్ధతులను అవలంబించాలని సూచిం చారు. ప్రభుత్వ కాల్స్ ద్వారా ప్రజల అభిప్రాయాలు తెలుసుకొని సమస్యలను త్వరగా పరిష్కరించి గ్రామాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. పంచాయతీ పనితీరును మరింత పారదర్శకంగా సమర్థవంతంగా మార్చేలా అధికారులు కలిసి పని చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని చెత్త నుండి సంపద సృష్టి షెడ్‌ను పరిశీలించారు. చెత్త వర్గీకరణ, తడి చెత్త నుండి ఎరువుల తయారీ పొడి చెత్త సేకరణ విధానాలను వీక్షించి సిబ్బందిని ప్రశంసించారు. పరిశుభ్రమైన గ్రామ వాతావరణం సృష్టించడానికి అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కె.వారిజ, పంచాయతీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan